దేశరాజధాని ఢిల్లీలో ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,48,000/- (22 క్యారెట్స్)
1,57,800/- (24 క్యారెట్స్)


# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 49 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 07-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

తెలంగాణలో ఏం నడుస్తుంది మామ
పచ్చ కాంగ్రెస్..గులాబీ కాంగ్రెస్..
స్వచ్ఛ కాంగ్రెస్ నడుస్తుంది మామ
రాజకీయ నాయకులు ఎవరికోసం
పనిచేస్తున్నారు మామ
వాళ్ల ఆస్తులు పెంచుకోవడం,
కుటుంబ సభ్యులను లీడర్లుగా
తయారు చేసుకోవడం మామ
తెలంగాణ రాష్ట్రం వస్తే ఎవరికి
మంచి జరిగింది మామ
10 సంవత్సరాలు
కల్వకుంట్ల కాందాం దోసుకుంది
రెండున్నర సంవత్సరాల నుండి
రేవంత్ వంతు అయింది మామ

సింగతి పటేల్ సుధాకర్ . ....
మంచిర్యాల



# కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై కాంగ్రెస్ నేతల ఫైర్

- బీఆర్ఎస్ నాయకత్వం పక్కదారి పడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శ
- రోడ్లపై కాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని హితవు
- రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని వెల్లడి
- కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్న
- కుంభకర్ణుడిలా పడుకున్నారంటూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ వ్యంగ్యం





**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పక్కదారి పడుతోందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై మాట్లాడటం, ధర్నాలు చేయడం కాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము సమాధానం చెబుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవాబు దారీతనంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

**రేషన్ కార్డులపై శ్రీధర్‌బాబు..**

తాము ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేశామని శ్రీధర్‌బాబు చెప్పారు. పార్టీలు చూడకుండా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం అందిస్తున్నామని, పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని అన్నారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్, బీజేపీలు విషప్రచారం చేస్తున్నాయని ఆరోపించిన ఆయన.. విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని హితవు పలికారు.

**కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదు?**

ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ప్రజలే కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారని అన్నారు. 360 రోజులు విధులకు హాజరుకాకపోతే ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. అదే విధంగా అసెంబ్లీకి హాజరుకాని వారిపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని వ్యాఖ్యానించారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై విమర్శలు..**

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో పేదలకు న్యాయం జరగలేదని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అప్పట్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లైనా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందన్నారు.

మిగతా 2లో



## ఫాంహౌస్ నుంచే గులాబీ బాస్ వ్యూహం

- అసెంబ్లీపై కేసీఆర్ కీలక నిర్ణయం!
- ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం
- 22ఏ భూముల అంశంపై అసెంబ్లీని స్తంభింపజేయాలని సూచన
- రైతులు, యువత, విద్యార్థులు, మహిళల సమస్యలను సభలో లేవనెత్తాలని ఆదేశం
- ఈసారి కూడా అసెంబ్లీకి దూరంగా ఉండనున్న కేసీఆర్?

**ఎర్రవల్లి, ప్రజావాయిస్ బ్యూరో :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ఆదివారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ శాసన సభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలు హాజరయ్యారు. సమావేశానికి ముందు కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి భోజనం చేశారు.

**అసెంబ్లీ వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం..**

రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టే అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై అసెంబ్లీలో

మిగతా 2లో

## హైదరాబాద్ ప్రజలకు గుడ్ న్యూస్.. త్వరలో మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్

- మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు
- ఛార్జీలను త్వరగా ఖరారు చేసి అమలు చేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశం
- నెలవారీ పాస్‌లతో పాటు రోజువారీ పాస్‌లు అందుబాటులోకి
- సాంకేతికంగా ఉమ్మడి పాస్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు అధికారుల వెల్లడి
- పాతబస్తీ మెట్రో కారిడార్ పనులను వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశం

2 లో

## 22ఏ భూములపై రేవంత్ సర్కార్‌ను నిలదీసిన రఘునందన్ రావు

- పేదల భూములను 22ఏలో పెట్టడంపై ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం
- ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేయలేదని వ్యాఖ్య
- దాదాపు లక్ష కోట్ల విలువైన భూములపై భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపణ
- 22ఏ భూముల పంచాయితీలో మంత్రులు ఎవరు పైసలు పంచుకుంటున్నారో సీఎం చెప్పాలని డిమాండ్
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల తరఫున మాట్లాడాలని సూచన



**గజ్వేల్, ప్రజావాయిస్ బ్యూరో :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పేద ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22ఏలో పెట్టలేదని అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో పర్యటించిన రఘునందన్ రావు.. పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు.

**పేదల భూములను 22ఏలో పెట్టడంపై ఆగ్రహం..**

పేద ప్రజల భూములను చివరకు ఇందిరాగాంధీ హయాంలో కూడా 22ఏలో పెట్టలేదని రఘునందన్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు, గిరిజనులు, నోరు లేని అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. దాదాపు లక్ష కోట్ల విలువైన పేదల భూములను 22ఏలో పెట్టి భారీ కుంభకోణానికి

మిగతా 2లో

## సీవీ ఆనంద్ డీజీపీ అయ్యాక క్రైమ్ రేట్ పెరిగింది: కవిత

- డీజీపీ సీవీ ఆనంద్‌పై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు
- తనపై కానిస్టేబుల్ తీవ్ర వ్యాఖ్యలు చేస్తే సస్పెన్షన్‌తో సరిపెడతారా? అంటూ ప్రశ్న
- తనపై పెట్టిన పోస్టును డీజీపీ కుటుంబ సభ్యులపై పెడితే ఊరుకుంటారా? అని నిలదీత
- కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తానని హెచ్చరిక
- ఉద్యమకారుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లోపు సీఎం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

2 లో

## తెలంగాణ విమోచన జైత్రయాత్రకు పోలీసుల బ్రేక్

- భారీ బైక్ ర్యాలీకి అనుమతి నిరాకరించిన పోలీసులు
- బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్ వరకు ర్యాలీకి బీజేపీ ఏర్పాట్లు
- మహేశ్వరం బీజేపీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు సహా పలువురు నేతలు ముందస్తు అదుపులోకి
- నిరసనకు ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను అణచివేస్తోందని బీజేపీ నేతల ఆరోపణ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ విమోచన జైత్రయాత్ర, భారీ బైక్ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ నేతలు ఏర్పాట్లు చేశారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఇదే సమయంలో మహేశ్వరం బీజేపీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు సహా పలువురు నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

**శివాజీ చౌక్ వద్ద ఉద్రిక్తత..**

తమ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు శివాజీ చౌక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నిరసనకు సిద్ధమైన కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి నిరాకరించడంతో పాటు తమ నేతలను అరెస్టు చేయడంపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**పోలీసుల తీరుపై బీజేపీ నేతల ఆగ్రహం..**

ర్యాలీకి అనుమతి నిరాకరించడం,

మిగతా 2లో

## మేడిపల్లి పోలీసుల పనితీరుకు ప్రశంసలు..

- వరుస చోరీ కేసులను ఛేదిస్తున్న మేడిపల్లి పోలీసులు
- నేరాల నియంత్రణలో సీఐ జలేందర్ రెడ్డి కీలక పాత్ర
- యువత గంజాయి, మాదకద్రవ్యాల వైపు వెళ్లొద్దని సూచన
- కాలనీలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపు
- నేరాల దర్యాప్తులో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతో ఉపయోగకరమని వెల్లడి



2 లో

## ఆత్మహత్యాయత్నానికి ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్

- ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై కేసు నమోదు
- పోలీసులు అరెస్టు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపం
- ఫిర్యాదు చేసిన మూడు రోజులకే ఆత్మహత్యాయత్నం



- ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఈశ్వర్ సాయి
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

2లో

# ఆత్మహత్యాయత్నానికి ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్..

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తనపై కేసు నమోదైనప్పటికీ ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈశ్వర్ సాయిపై ఫిర్యాదు చేసిన మూడు రోజులకే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

**ఆగస్టు 22న కేసు నమోదు..**

మాధురి రాథోడ్ ఫిర్యాదు మేరకు గత ఆగస్టు 22వ తేదీన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై కేసు నమోదైంది. పెళ్లి పేరుతో తనను నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయలేదని మాధురి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

**అరెస్టు చేయలేదని ఆరోపణలు..**

కేసు నమోదైన తర్వాత కూడా ఈశ్వర్ సాయి అరెస్టు కాకపోవడంతో మాధురి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. పోలీసులు నిందితుడిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

**ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన ఈశ్వర్ సాయి..**

తనపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. కేసు నమోదైన అనంతరం ఆయన పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

**నిందితుడి కోసం పోలీసుల గాలింపు..**

ఈశ్వర్ సాయి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం ఘటనతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేసులో తదుపరి పరిణామాలు, పోలీసుల చర్యలపై ఆసక్తి నెలకొంది.

# అసెంబ్లీకి రేవంత్ సర్కార్ భయపడుతోంది

- మహేశ్వర్ రెడ్డి
- అసెంబ్లీని ఎక్కువ రోజులు నడిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భయపడుతోందని విమర్శ
- కాంగ్రెస్ హామీల అమలుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని వెల్లడి
- ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రశ్నిస్తామని స్పష్టం
- అవినీతి, అక్రమాలు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యూహం
- 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీజేపీ డిమాండ్



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఆదివారం అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై బీజేఎల్పీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హామీలపై నిలదీస్తాం..**

రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించినట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సభా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

**ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలపై పోరాటం..**

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, అవినీతి, అక్రమాలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని మహేశ్వర్ రెడ్డి అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా సభలో ప్రశ్నిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పేలా చేస్తామని స్పష్టం చేశారు.

**15 రోజుల పాటు సభ నడపాలి..**

అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. తక్కువ రోజులు సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా చేయొద్దని అన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెడతామని చెప్పారు.

**వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నిస్తాం..**

రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటున్న తీరుపై, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తామని బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ తెలిపారు. విద్యార్థుల అవస్థలు, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు, ఆ తర్వాత చేస్తున్న వాగ్దానాలపై కూడా సభలో ప్రశ్నిస్తామని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై కాంగ్రెస్ నేతల ఫైర్



తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు కూడా ఇచ్చామని తెలిపారు.

**కేసీఆర్‌పై శ్రీ గణేశ్, స్వర్ణ ఫైర్..**

కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కుంభకర్ణుడిలా పడుకున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాడు కేసీఆర్ మోసం చేశారని గ్రహించిన ప్రజలు ఆయనను ఓడించారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటున్నప్పటికీ పనిచేయడం లేదని విమర్శించారు. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.

**ఆ విషయాన్ని గమనించాలి: మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు..**

ఫామ్‌హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. కేసీఆర్ తన కొడుకు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావులను ప్రజల మీదకు పంపారని, వారు ఏం మాట్లాడుతున్నారో కూడా ఆయన గమనించడం లేదని విమర్శించారు. దాచుకోవడం, దోచుకోవడమే కేసీఆర్ పని అని ఆరోపించిన స్వర్ణ.. పదేళ్లలో కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు.అలాగే ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, విభజనను గతంలో అవహేళన చేసిన బీజేపీ నేతలకు తెలంగాణపై మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు.

# సీవీ ఆనంద్ డీజీపీ అయ్యాక క్రైమ్ రేట్ పెరిగింది: కవిత



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పోలీసు వ్యవస్థపై విమర్శలు వెల్లువెత్తాయి. సీవీ ఆనంద్ డీజీపీ అయిన తర్వాత రాష్ట్రంలో నేరాల రేటు పెరిగిందని టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తనపై ఓ కానిస్టేబుల్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేసినప్పటికీ కేవలం సస్పెన్షన్‌తో సరిపెడతారా? అని ఆమె ప్రశ్నించారు. తనపై పెట్టిన పోస్టును డీజీపీ కుటుంబ సభ్యులపై పెడితే ఊరుకుంటారా? అంటూ నిలదీశారు.

**చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో బదనాం చేస్తా..**

ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో కవిత మాట్లాడారు. తనపై పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తానని హెచ్చరించారు. పోలీసు శాఖ వ్యవహరిస్తున్న తీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి..**

ప్రజలు రేవంత్ రెడ్డిని నమ్మి సీఎం కుర్చీలో కూర్చోబెట్టారని కవిత అన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్నారని, కోదండరాం పక్కన ఉన్నందున ఉద్యమకారులు రేవంత్ రెడ్డిని నమ్మారని పేర్కొన్నారు. ఉద్యమకారులపై వేసిన కేఎస్ కమిటీ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ జన సమితి తరఫున కోదండరాం ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారని, ప్రభుత్వం తరఫున కూడా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీ సమావేశాల్లోపు సీఎం నిర్ణయం తీసుకోవాలి..**

అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారులను పట్టించుకోకుండా ఉంటే ఎలా అని కవిత ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు ఉద్యమకారులపై సీఎం నిర్ణయం తీసుకోవాలని, కేఎస్ కమిటీ నివేదికను త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# 22ఏ భూములపై రేవంత్ సర్కార్‌ను నిలదీసిన రఘునందన్ రావు



**మొదటి పేజీ తరువాయి**

తెరలేపారని విమర్శించారు.

**మంత్రులపై సంచలన ఆరోపణలు..**

లక్ష కోట్ల విలువైన భూముల పంచాయితీలో పైసలు పంచుకుంటున్న మంత్రులు ఎవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లేదంటే ఆ డబ్బంతా తన ఖాతాలోనే వేసుకుంటానని సీఎం భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. పేదల భూములను 22ఏలో పెట్టొద్దని, అవి తమ తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న ఆస్తులని పేర్కొన్నారు.

**కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..**

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరు కావాలని రఘునందన్ రావు కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల సమస్యలపై మాట్లాడితే వారికి గౌరవం ఉంటుందని సూచించారు. గజ్వేల్ ప్రజల తరఫున అసెంబ్లీలో వారి సమస్యలను ప్రస్తావించాలని కోరారు.

# మేడిపల్లి పోలీసుల పనితీరుకు ప్రశంసలు

**మేడిపల్లి, ప్రజావాయిస్ బ్యూరో :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస చోరీ కేసులను ఛేదిస్తూ నేరాల నియంత్రణలో పోలీసులు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేరాల నియంత్రణలో మేడిపల్లి సీఐ జలేందర్ రెడ్డి ముందుండి పనిచేస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఈ ఏడాది మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను అగ్రగామిగా నిలిపేందుకు మరింత కృషి చేయాలని వారు కోరుతున్నారు.

**వరుస చోరీ కేసుల ఛేదన..**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న పలు చోరీ కేసులను పోలీసులు వరుసగా ఛేదిస్తున్నారు. నేరాల నియంత్రణతో పాటు నిందితులను గుర్తించి పట్టుకోవడంలో సీఐ జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసు బృందం చురుకుగా వ్యవహరిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి..**

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వైపు వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ జలేందర్ రెడ్డి సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని యువతకు పిలుపునిచ్చారు.

**ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి, చెంగిచెర్ల, బోడుప్పల్, నారపల్లి, పీర్జాదిగూడ తదితర ప్రాంతాల్లోని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ప్రతి ఇంటి వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగిన సమయంలో నిందితులను గుర్తించడం పోలీసులకు సులభతరం అవుతుందని తెలిపారు.

**నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం..**

నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సీఐ జలేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీలు, నివాస ప్రాంతాల్లో భద్రతా చర్యలు పాటిస్తూ అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను మరింతగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఫాంహౌస్ నుంచే గులాబీ బాస్ వ్యూహం



**మొదటి పేజీ తరువాయి**

ప్రశ్నలు సంధించాలని సూచించినట్లు సమాచారం.

**రైతులు, యువత సమస్యలపై పోరాటం..**

బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ వేదికగా లేవనెత్తాలని సూచించారు. ప్రభుత్వ హామీలు, పెండింగ్ లో ఉన్న పథకాలపై అధికార పక్షాన్ని నిలదీయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

**22ఏ భూముల అంశంపై సమరం..**

22ఏ భూముల అంశాన్ని అసెంబ్లీలో ప్రధానంగా ప్రస్తావించాలని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ అసెంబ్లీని స్థంభింపజేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టేలా వ్యూహం రూపొందించాలని సూచించినట్లు సమాచారం.

**అసెంబ్లీకి కేసీఆర్ దూరం?**

ఈసారి కూడా శాసనసభ సమావేశాలకు హాజరుకాకూడదని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచే పార్టీ శాసనసభా పక్షానికి మార్గనిర్దేశం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటానికి వ్యూహరచన చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ అనుసరించబోయే వ్యూహంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ విమోచన జైత్రయాత్రకు పోలీసుల బ్రేక్

**మొదటి పేజీ తరువాయి**

ముందస్తు అరెస్టులపై బీజేపీ నేతలు పోలీసుల తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం అన్యాయంగా అడ్డుకుంటోందని విమర్శించారు.

**అరెస్టులతో కార్యక్రమాలను అడ్డుకోలేరు..**

అరెస్టులు, ఆంక్షలతో తమ కార్యక్రమాలను అడ్డుకోలేరని బీజేపీ నేతలు తేల్చి చెప్పారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించతలపెట్టిన కార్యక్రమాలను ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు.

**భారీ బైక్ ర్యాలీకి బ్రేక్..**

బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు చేపట్టాల్సిన భారీ బైక్ ర్యాలీకి పోలీసుల అనుమతి లేకపోవడంతో కార్యక్రమంపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు బీజేపీ కార్యకర్తల అరెస్టులు, ర్యాలీపై ఆంక్షలతో హైదరాబాద్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది.




# హైదరాబాద్ ప్రజలకు గుడ్ న్యూస్.. త్వరలో మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** హైదరాబాద్ నగర ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం బేగంపేట మెట్రో రైల్ భవన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. మెట్రో, ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.



**త్వరలో ఉమ్మడి పాస్ విధానం..**

ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులు, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ నగరంలో ప్రయాణించే వారు మెట్రో, ఆర్టీసీ సేవలను వినియోగిస్తుంటారు. ప్రస్తుతం రెండు రవాణా వ్యవస్థలకు వేర్వేరుగా పాస్‌లు తీసుకోవాల్సి వస్తోంది. ఈ ఇబ్బందిని తొలగించేందుకు మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. నెలవారీ పాస్‌లతో పాటు రోజువారీ పాస్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎస్ సూచించారు.

**ఏ రోజు నుంచైనా అమలుకు సిద్ధం..**

బేగంపేటలో నిర్వహించిన సమావేశంలో టీజీఎస్ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి పాస్ జారీకి సాంకేతికంగా సిద్ధంగా ఉన్నామని మెట్రో, టీజీఎస్ఆర్టీసీ అధికారులు సీఎస్‌కు వివరించారు. ఏ రోజు నుంచైనా ఉమ్మడి పాస్ విధానాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. దీంతో ఛార్జీలను వేగంగా ఖరారు చేసి విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని సంజయ్ జాజు ఆదేశించారు.

**పాతబస్తీ మెట్రోపై సీఎస్ ఆరా..**

సమన్వయ సమావేశంలో పాతబస్తీలో ప్రతిపాదిత మెట్రో కారిడార్ పనులపైనా సీఎస్ ఆరా తీశారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెట్రో కారిడార్ విస్తరణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

**మెట్రో స్టేషన్లలో సౌకర్యాల పరిశీలన..**

సమన్వయ సమావేశం అనంతరం సీఎస్ సంజయ్ జాజు స్వయంగా మెట్రోలో ప్రయాణించారు. బేగంపేట నుంచి ప్యారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించి స్టేషన్లలోని పార్కింగ్ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలను పరిశీలించారు. పార్కింగ్ సదుపాయాలను మరింత మెరుగుపరచాలని, వాణిజ్య స్థలాలను సమర్థంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి పాస్ విధానం అమల్లోకి వస్తే నిత్యం మెట్రో, ఆర్టీసీని వినియోగించే నగరవాసులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.

# ప్రశ్నించడమే పంతం.. పోరాడటమే బొల్లం నైజం

**ప్రజా వాయిస్, కోదాడ:** అధికారం ఉంటేనే అధికారులను ప్రశ్నించగలమా? పదవి ఉంటేనే ప్రజల కోసం పోరాడగలమా ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజా నాయకుడిగా నిలవగలమా కోదాడ రాజకీయాల్లో బొల్లం మల్లయ్య యాదవ్ ప్రయాణం ఈ ప్రశ్నలకు తనదైన సమాధానం చెబుతోంది. పదవి చేతిలో లేక పోయినా.. ప్రజల చెయ్యి విడవలేదు. అధికారం దూరమైనా.. ప్రజల సమస్యలకు దూరం కాలేదు. ఎన్నికలు ముగిసినా.. ఆయన ప్రజా ప్రయాణం ఆగలేదు. అన్యాయం జరిగిన చోట అడుగు.. అక్రమం జరిగిన చోట ప్రశ్న.. ప్రజలకు ఆపద వచ్చిన చోట అండ.. ఇదే బొల్లం మల్లయ్య యాదవ్ రాజకీయ పంథా నియోజకవర్గంలో ఏ మూల సమస్య వినిపించినా అక్కడికి వెళ్లడం.. బాధితుల మాట వినడం.. అధికారులను ప్రశ్నించడం.. అవసరమైతే ప్రజలను కూడగట్టి ఉద్యమించడం.. ఇదే ఆయనకు నిత్యకృత్యంగా మారింది.

- పదవి లేకున్నా ప్రజల పక్షాన విరామమెరగని పోరాటం
- రైతు నుంచి పేద వరకు..
- అక్రమాల నుంచి పాలకుల వైఫల్యాల వరకు నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం బొల్లం మల్లయ్య యాదవ్
- అన్యాయం కనిపిస్తే ప్రశ్న.. అక్రమం బయటపడితే నిలదీత
- ప్రజలకు ఆపద వస్తే పోరాటం
- కోదాడలో విరామమెరగని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజా ప్రస్థానం



### జనంలోనే జవాబు వెతుకుతూ..

రాజకీయ నాయకుడు ప్రజల దగ్గరకు ఎన్నికల సమయంలో మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేదని తన ఆచరణ ద్వారా చూపించే ప్రయత్నం చేస్తున్నారు బొల్లం. రైతు పొలంలోకి వెళ్తున్నారు. పేదవాడి ఇంటి వద్ద నిలుస్తున్నారు. విద్యార్థుల సమస్యలు వింటున్నారు. యువతతో మాట్లాడుతున్నారు. గ్రామాల్లో తిరుగుతున్నారు. ప్రజలే తన బలం.. ప్రజల సమస్యలే తన రాజకీయ ఎజెండా అన్నట్టుగా ముందుకు సాగుతున్నారు. పదవి లేకున్నా ప్రజల మధ్య ఉండొచ్చని.. అధికారం లేకున్నా ప్రజల కోసం పోరాడొచ్చని ఆయన మరోసారి నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

### నీరు కోసం నినాదం.. రైతు కోసం పోరాటం

పొలంలో పంట ఎండిపోతున్నప్పుడు రైతుకు రాజకీయ ప్రసంగాలు అవసరం లేదు. నీరు కావాలి. ఈ విషయాన్ని ప్రధానంగా ముందుకు తీసుకొచ్చిన బొల్లం మల్లయ్య యాదవ్ నాగార్జునసాగర్ నుంచి కోదాడ రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించారు. ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రైతుల ఆవేదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. పొలానికి నీరు రాకపోతే రైతు భవిష్యత్ ఎక్కడ? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు సమస్యను రాజకీయ విమర్శకు పరిమితం చేయకుండా.. ఉద్యమ రూపంలో ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లడం ఈ పోరాటం ప్రత్యేకతగా నిలిచింది.

### కరెంటు కోసం కదిలిన పోరాటం

నీరు ఉన్నా కరెంటు లేకపోతే పంటకు నీరు అందదు. రైతుకు సాగునీరు అందాలంటే నిరంతర విద్యుత్ అవసరమనే అంశాన్ని ముందుకు తెస్తూ 24 గంటల నాణ్యమైన కరెంటు కోసం బొల్లం ఉద్యమించారు. కరెంటు సరఫరా మెరుగుపడకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత కరెంటు కోతలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి సమస్యపై ప్రజలను, రైతులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నించారు. రైతు సమస్యపై మాట్లాడటం ఒకటి.. రైతులతో కలిసి నిలబడటం మరోటి. బొల్లం రెండో మార్గాన్ని ఎంచుకున్నారనే అభిప్రాయం ఈ కార్యక్రమాల ద్వారా కనిపించింది.

### పేద మహిళ కోసం బంద్

ఒక నిరుపేద మహిళ జీవనాధారానికి సంబంధించిన సమస్య కోదాడలో ఉద్యమంగా మారింది. గంధం కనకమ్మ ఘటనలో ఆమె కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు బొల్లం మల్లయ్య యాదవ్ అండగా నిలిచారు. ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన విషయం కాదని.. పేదల జీవన హక్కుకు సంబంధించిన ప్రశ్న అని చెబుతూ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. సాధారణంగా అధికార వ్యవస్థల ముందు పేదలు ప్రశ్నించడానికి వెనుకడుగు వేస్తారు. అలాంటి వారి పక్షాన ఎవరో ఒకరు నిలబడాలి.. ఆ గొంతు బలంగా వినిపించాలి అనే భావనతో ఆయన ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారు.

### పోలీసులపై ప్రశ్న.. ప్రజల పక్షాన పోరాటం

పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ప్రశ్నించడంలో కూడా బొల్లం వెనుకడుగు వేయలేదు. కనకమ్మ ఘటనలో పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. నిజానిజాలపై విచారణ జరగాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడం తప్పు కాదు.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలని కోరడమే ప్రజాస్వామ్యమనే సందేశాన్ని ఈ ఉద్యమం ఇచ్చింది.

### మత్తు ముప్పుపై మోగుతున్న హెచ్చరిక

గంజాయి.. డ్రగ్స్.. పేకాట.. ఈ పేర్లు వినగానే ఆందోళన చెందేది ప్రతి తల్లిదండ్రి. యువతను మత్తు వైపు నెట్టే పరిస్థితులపై బొల్లం మల్లయ్య యాదవ్ పదేపదే ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజల్లో వినిపిస్తున్న ఆందోళనలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యువత చేతిలో పుస్తకం ఉండాల్సిన సమయంలో మత్తు చేరకూడదనే ఆవేదనతో ఈ సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తున్నారు. సమాజాన్ని లోపల నుంచి దెబ్బతీసే సమస్యలను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నారు.

### ప్రజల సొమ్ముకు కాపలా

అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం ఖర్చవుతున్నప్పుడు ఆ పనుల నాణ్యతపై ప్రశ్నించడం కూడా ప్రజా బాధ్యతే అని బొల్లం చెబుతున్నారు. కోదాడలో జరుగుతున్న యూజీడీ పనులపై నాణ్యతకు సంబంధించిన సందేహాలు తలెత్తినప్పుడు వాటిపై ప్రశ్నించారు. పనులు పూర్తయిన తర్వాత తప్పులు కనిపెట్టడం కంటే.. జరుగుతున్నప్పుడే నిలదీయాలని డిమాండ్ చేశారు. ప్రజల డబ్బుతో జరిగే పనుల్లో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే అనే సందేశాన్ని ముందుకు తీసుకువచ్చారు.

### రేపటి కోదాడ కోసం కూడా..

ఈరోజు రైతు సమస్య మాత్రమే కాదు.. రేపటి కోదాడ అభివృద్ధి కూడా ముఖ్యమే. హైదరాబాద్,అమరావతి చెన్నై హైస్పీడ్ రైలు మార్గం కోదాడ మీదుగా వెళ్లాలని డిమాండ్ చేస్తూ బొల్లం మల్లయ్య యాదవ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతానికి రవాణా, అభివృద్ధి అవకాశాలు రావాలని డిమాండ్ చేశారు. నేటి సమస్యలకు పరిష్కారం కోరడమే కాదు.. రేపటి తరానికి అవకాశాలు సాధించడమూ రాజకీయ నాయకుడి బాధ్యతే అనే ఆలోచనను ఈ పోరాటం ప్రతిబింబించింది.

### హామీలు గుర్తు చేస్తున్న పోరాటం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోవద్దని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గ్యారంటీలు.. రైతు సమస్యలు.. సాగునీరు.. విద్యుత్.. యువతకు ఇచ్చిన హామీలు.. అమలు ఎక్కడ? అంటూ ప్రశ్నిస్తున్నారు. పాలకులను ప్రశ్నించడం ప్రతిపక్షం చేసే రాజకీయమే కాదు.. ప్రజలకు ఇచ్చిన మాటను గుర్తుచేయడం ప్రజా బాధ్యత కూడా అనే వాదనను ఆయన ముందుకు తీసుకెళ్తున్నారు.

### వంటావార్పు నుంచి విద్యార్థుల ధర్నా వరకు

సమస్యకు తగ్గట్టు పోరాటం కూడా మారుతోంది. గ్రామాల్లో వంటావార్పు.. పట్టణాల్లో ధర్నా.. విద్యార్థులతో నిరసన.. రైతులతో ఉద్యమం.. ప్రతి సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విభిన్న రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ఇచ్చిన హామీలు, యువత ఉపాధి వంటి అంశాలపై విద్యార్థుల పక్షాన నిలుస్తున్నారు. రైతు నుంచి విద్యార్థి వరకు.. పేద నుంచి మధ్య తరగతి వరకు.. గ్రామం నుంచి పట్టణం వరకు.. సమస్య ఎవరిదైనా తనదేనన్నట్టుగా పోరాటం చేస్తున్నారు.

### విద్యార్థి ఉద్యమ పంతం ఇంకా అలాగే..

కాలం మారింది. రాజకీయ పరిస్థితులు మారాయి. పదవులు మారాయి. కానీ ప్రశ్నించే స్వభావం మాత్రం మారలేదనే అభిప్రాయం ఆయన పోరాటాలను చూస్తే కలుగుతుంది. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా తనలో ఏర్పడిన పోరాట స్ఫూర్తిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అన్యాయం కనిపిస్తే మౌనం కాదు. అక్రమం కనిపిస్తే రాజీ కాదు. ప్రజలకు సమస్య వస్తే వెనుకడుగు కాదు. ప్రశ్నించడమే తన రాజకీయ ఆయుధంగా మార్చుకున్న నాయకుడిగా బొల్లం మల్లయ్య యాదవ్ ముందుకు సాగుతున్నారు.

### పదవి లేదు.. ప్రజల బలం ఉంది!

రాజకీయాల్లో అసలైన శక్తి పదవిలో కాదు.. ప్రజల విశ్వాసంలో ఉంటుందని బొల్లం మల్లయ్య యాదవ్ తన రాజకీయ ప్రయాణంతో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల మధ్య కనిపించే రాజకీయాలకు భిన్నంగా.. నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజల బాధను వింటున్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే ఉద్యమిస్తున్నారు. పదవి లేదు.. కానీ పంతం ఉంది. అధికారం లేదు.. కానీ ప్రశ్నించే ధైర్యం ఉంది. అధికారిక హోదా లేదు.. కానీ ప్రజల కోసం పోరాడే సంకల్పం ఉంది.

### పోరాటమే ఆయన గుర్తింపు

రైతు పొలంలో నీరు లేకపోతే ఆయన ప్రశ్న.. కరెంటు అందకపోతే ఆయన పోరాటం.. పేదవాడికి అన్యాయం జరిగితే ఆయన అండ.. పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వస్తే ఆయన నిలదీత.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు ముప్పుపై ఆయన హెచ్చరిక.. ప్రజాధనం వృథా అవుతుందన్న సందేహం వస్తే ఆయన ప్రశ్న.. అభివృద్ధి అవకాశాన్ని కోదాడ కోల్పోతే ఆయన ఉద్యమం.. సమస్యలు మారుతున్నాయి.. పోరాటాల రూపాలు మారుతున్నాయి.. కానీ ప్రజల పక్షాన నిలబడాలనే బొల్లం మల్లయ్య యాదవ్ పంతం మాత్రం మారడం లేదు. అధికారం దూరమైనా.. ప్రజలకు దూరం కాలేదు ఎన్నికలు ముగిసినా.. ప్రజా పోరాటం ఆగలేదు కోదాడలో అన్యాయం కనిపిస్తే ప్రశ్నించే గొంతుగా.. అక్రమాలపై నిలదీసే స్వరంగా.. పేదలకు ఆపద వస్తే అండగా.. రైతు సమస్యలకు పోరాట యోధుడిగా.. నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ బొల్లం మల్లయ్య యాదవ్ తన ప్రజా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పదవి కోసం కాదు.. ప్రజల కోసం. అధికారం కోసం కాదు.. న్యాయం కోసం. రాజకీయ లాభం కోసం కాదు.. ప్రజల గొంతుకగా నిలవడం కోసం



## అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యల పుస్తకాన్ని నిలిపివేయాలి

- పుస్తక రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

**శామీర్‌పేట్ / సెప్టెంబర్ 6, ప్రజా వాయిస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా ప్రచురిస్తున్న "అంబేద్కర్ కల్పిత నాయకుడు" పుస్తకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, పుస్తక ప్రచురణకర్త హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ, TGSRTC SC, ST EWA, రాష్ట్ర దళిత సేన శామీర్‌పేట్ నాయకులు ఆదివారం శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో సీఐ కి ఫిర్యాదు అందజేసి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్న పుస్తక ప్రచురణను నిలిపివేయడంతో పాటు, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు ఎం. వెంకటస్వామి, కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, మధు, ఏ.డి. మధు, RTCEWA ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, సిపిఐ రాష్ట్ర నాయకులు సాయిలు గౌడ్, దళిత సేన నాయకులు మురళి, నీరుడు బాలేష్, బుర్క నర్సింగరావు, కైరా బాలు, బుర్క వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఆర్.బి.వి.ఆర్.ఆర్. మోడల్ పాఠశాలలో మెగా వైద్య శిబిరం

- ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు 650 మంది విద్యార్థిని, విద్యార్థులకు, వైద్య పరీక్షలు

**ప్రజా వాయిస్.. వనపర్తి** వనపర్తి జిల్లా కొత్తకోట మండల పరిధిలోని రాజా బహద్దూర్ వెంకట రామా రెడ్డి మోడల్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆదివారం రోజు మెగా ఘనంగా వైద్య శిబిరాన్ని యస్.వి.యస్. మెడికల్ కాలేజ్ హాస్పిటల్, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించారని ఆర్ బి వి ఆర్ ఆర్ సొసైటీ కన్వీనర్ టీ గిరిధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య విభాగాలకు చెందిన సుమారు 30 మంది వైద్య నిపుణులు తో జనరల్ మెడిసిన్, ఫిజిషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, ఆప్తమాలజీ, ఈ.ఎన్.టి., పీడియాట్రిక్స్, పల్మనాలజీ, సైకియాట్రీ, డెర్మటాలజీ విభాగాలకు చెందిన వైద్యులుతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.పాఠశాలలో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 650 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. వైద్య శిబిరంలో అవసరమైన విద్యార్థులకు యస్.వి.యస్. మెడికల్ కాలేజ్ హాస్పిటల్ తరపున ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపు నిర్వహించిన స్కూలు యాజమాన్యానికి ఉపాధ్యాయులకు ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి విద్యార్థులు తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజా బహద్దూర్ వెంకట రామా రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున వైస్ ప్రెసిడెంట్ & కన్వీనర్ టి. గిరిధర్ రెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ కె. చంద్రశేఖర్ రెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు ఎ. సుకన్య రెడ్డి, రూపా రెడ్డి, అనురాధ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. హైమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ కె. బాజీ రెడ్డి, మేనేజర్ కె. సుధాకర్ రెడ్డితో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్ అభివృద్ధి.. కాంగ్రెస్ విధ్వంసం

- ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- 'పల్లెల విధ్వంసం' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటన



**ప్రజావాయిస్/వికారాబాద్:** కేసీఆర్ హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో అభివృద్ధి కుంటుపడిందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామంటూ గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.ఆదివారం ధారూర్ మండలం గట్టేపల్లి గ్రామంలో నిర్వహించిన 'పల్లెల విధ్వంసం' కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. అనంతరం బంట్వారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, పార్కులతో గ్రామాల రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. బంట్వారం, గట్టేపల్లి ప్రజల గొంతు భవిష్యత్ రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని మెతుకు ఆనంద్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభం

- వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యాలయం ప్రారంభం

.**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుకు ప్రభుత్వం తరపున తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో అధికారిక కార్యాలయాన్ని కేటాయించారు. ఈ కార్యాలయాన్ని ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు.కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రముఖులు ప్రభుత్వ విప్ విజయరమణ రావును శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## 2028 పైనే ప్రధాన పార్టీల దృష్టి!

- కాంగ్రెస్ లో హామీల అమలు సవాల్
- అధికార పీఠం కాపాడుకునే యత్నం!
- బీఆర్ ఎస్ లో హామీలు తీర్చాల్సిందే' అంటూ నిరసనల రీ-ఎంట్రీ వ్యూహం!
- బీజేపీ లో 2028 ముందస్తు లెక్కింపు
- పారిశ్రామిక బెల్ట్ పై పట్టు!



**ప్రజా వాయిస్ పెద్దపల్లి** తెలంగాణలో తదుపరి శాసనసభ ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, పెద్దపల్లి జిల్లా రాజకీయం ఇప్పటినుంచే అత్యంత రసవత్తరంగా మారింది. రామగుండం పారిశ్రామిక ప్రాంతం, సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సిఎల్ పరిశ్రమలతో పాటు విస్తారమైన వ్యవసాయ భూములు ఉన్న ఈ ప్రాంతంలో గెలుపోటములను బొగ్గు గని కార్మికుల డిమాండ్లు, పారిశ్రామిక నిరుద్యోగం మరియు రైతు సమస్యలే శాసిస్తుంటాయి. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన పార్టీలు వేస్తున్న ముందస్తు వ్యూహాలపై 'ప్రజా వాయిస్' ప్రత్యేక విశ్లేషణ.హస్తం వ్యూహం హామీల సవాల్ పట్టు కోసం ప్రయత్నం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో తమ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నేతలు దృష్టి సారించారు. అయితే, ఇచ్చి నెరవేర్చని హామీలను పూర్తి చేయడం, పారిశ్రామిక నిరుద్యోగ పరిష్కారంలో వేగం పెంచడం మరియు స్థానిక నేతల మధ్య అంతర్గత సమన్వయం కాపాడుకోవడం కాంగ్రెస్‌కు ప్రధాన పరీక్షగా మారింది. గులాబీ దండుకోల్పోయిన వైభవాన్ని తిరిగి సాధించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పోరాటాలకు దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ గులాబీ శ్రేణులు ధర్నాలు, నిరసనలు ఉధృతం చేస్తున్నాయి. హామీలు ఇచ్చారు.. నెరవేర్చాల్సిందే అని డిమాండ్ చేస్తూ ప్రజల్లో అసంతృప్తిని ఆసరాగా చేసుకుని పాత పునాదులను పటిష్టం చేసుకునే పనిచేస్తోంది. కమలం ఎత్తుగడ రాబోయే ఎన్నికల కోసం ఇప్పటినుంచే ప్రజల్లో పాగా వేయాలని బీజేపీ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక బెల్ట్, సింగరేణి కార్మికులు మరియు పట్టణ ప్రాంత యువతను ఆకర్షించడం ద్వారా మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని చూస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఓటు బ్యాంకును పెంచుకుంటూ బలమైన స్థానిక నాయకత్వాన్ని సిద్ధం చేసుకుంటోంది.ప్రత్యేక ఆకర్షణ జిల్లా రాజకీయాల్లో మంథనిది అత్యంత తీవ్రమైన శైలి. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పోటీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా తీవ్ర వర్గ వైరంలా మారింది. సొంత బంధువులైనా సరే పార్టీలు వేరైతే ముఖం చాటేసేంత, శుభకార్యాల్లో సైతం పలకరించుకోలేనంత నిశ్శబ్ద ఉద్రిక్తత ఇక్కడ నెలకొంది. ఎన్నికల ముందస్తు లెక్కలు ఎలా ఉన్నా, అంతిమంగా సింగరేణి కార్మికులు, రైతులు, యువత తీర్పే తుది నిర్ణయం. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని అధికారాన్ని కాపాడుకోవడం కాంగ్రెస్‌కు, నిరసనలతో పునరాగమనం చేయడం బీఆర్ఎస్‌కు, ఇప్పటినుంచే ప్రజాక్షేత్రంలో పాగా వేయడం బీజేపీకి సవాలుగా మారింది!

# రూ. 5 వేలకు చేనేత సర్టిఫికెట్

- మగ్గం పని రాకున్నా చేనేత సర్టిఫికెట్
- జోరుగా నకిలీ చేనేత సర్టిఫికెట్ల జారీ
- చేనేత పెన్షన్ల కోసం అడ్డదారులు
- చేనేత సంఘ అధ్యక్షుల వసూళ్ల పర్వం
- జౌళి శాఖ అధికారుల అండ
- అసలైన మగ్గం కార్మికులకు అందని చేనేత పెన్షన్
- నకిలీ సర్టిఫికెట్ల దందా ఆపాలని అసలైన కార్మికుల డిమాండ్
- వందల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్ జారీ



**ప్రజా వాయిస్ దోమకొండ**/దోమకొండ మండలం పరిసర మండలాలలో నకిలీ చేనేత కార్మికుల సర్టిఫికెట్ల జారీ భారీ ఎత్తున కొనసాగుతుంది. ఒక్కొక్క చేనేత కార్మిక సర్టిఫికెట్ కు 5000 వసూలు చేస్తూ దంద కొనసాగిస్తున్నారు. మగ్గం పని రాకుండా కనీస అవగాహన లేకున్నా వస్త్రం తయారీ శిక్షణ లేకున్నా విచ్చలవిడిగా చేనేత కార్మిక సర్టిఫికెట్ దందా నడుస్తుంది. ఇప్పటివరకు దోమకొండలో పదుల సంఖ్యలో నకిలీ చేనేత కార్మిక సర్టిఫికెట్లు చేనేత సంఘాల నేతలు అధ్యక్షులు జారీ చేస్తున్నారు. 5000 రూపాయలకు ఒక చేనేత కార్మిక నకిలీ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. చేనేత సంఘాల నేతలకు జౌళి శాఖ అధికారులు అండదండలుగా నిలుస్తున్నారు. మగ్గం కార్మికుల శిక్షణ పొందడం లేదు మగ్గం పని రావడం లేదు మగ్గం పై కనీస అవగాహన లేదు కానీ డబ్బులు వసూలు చేస్తూ చేనేత కార్మిక సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. కామారెడ్డి దోమకొండ గత చేనేత సహకార సంఘాలు ఇదే రకంగా నకిలీ సర్టిఫికెట్లను జారీ చేయడంతో వారికి చేనేత కార్మిక పెన్షన్లు వస్తున్నాయి. కొత్త చేనేత సహకార సంఘాల నేతలు కూడా 5000 రూపాయలు వసూలు చేస్తూ కనీస మగ్గం పని రాకుండా కార్మిక సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. చేనేత సహకార సంఘాల నేతలు వసూలు చేస్తున్న 5000 రూపాయలలో వెయ్యి రూపాయలు జౌళి శాఖ అధికారులకు అందజేస్తూ శిక్షణ లేకుండా మగ్గం పని రాకుండా నకిలీ సర్టిఫికెట్ల జారీ పరంపరగా కొనసాగుతుంది. డబ్బులు ఇవ్వలేని స్థితిలో ఉన్న చేనేత వర్గాలు తమ తొలి చేయూత పెన్షన్ రెండు నెలల పెన్షన్ డబ్బులను వారికి ఇవ్వాలని ఒప్పందం మేరకు జోరుగా నకిలీ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. దోమకొండ, పాత తాలూకా పరిసర మండలాలలో అడ్డదారులలో కార్మిక సర్టిఫికెట్లు ఒక దందాగా కొనసాగిస్తున్నారు. నెలరోజుల మగ్గం శిక్షణ లేకున్నా మగ్గం పని కనీసం రాకుండా నకిలీ సర్టిఫికెట్లను తయారుచేసి అమ్ముకుంటున్నారు. కనీస పరిజ్ఞానం లేని వారు చేనేత కార్మిక పెన్షన్లు పొందుతున్నారు. కొత్తగా సర్టిఫికెట్లను అడ్డు అదుపు లేకుండా జారీ చేస్తున్నారు. అసలైన చేనేత కార్మికులకు చేయూత పెన్షన్ రావడంలేదని బాధపడుతున్నారు. నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారు చేనేత కార్మిక పెన్షన్ పొందుతున్నారు. చేనేత కార్మికుల నకిలీ సర్టిఫికెట్ల దందా ఆపాలని అసలైన కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దోమకొండ, దాని పరిసర మండలాలలో వందల సంఖ్యలో నకిలీ చేనేత సర్టిఫికెట్ జారీ చేసినట్లు అసలైన కార్మికులే బాహాటంగా చెబుతున్నారు. దోమకొండ చేనేత సహకార సంఘాలకు నకిలీ సర్టిఫికెట్ల దందా కాసుల వర్షం కురిపిస్తుంది. సంఘాల నేతలు 5000 రూపాయలు వసూలు చేస్తూ నకిలీ సర్టిఫికెట్లను తయారు చేస్తున్నార. జౌళి అధికారులు నకిలీ సర్టిఫికెట్ల జారీకి సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. శిక్షణ లేకున్నా మగ్గం పని రాకుండా వందల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లను తయారుచేసి లక్షల రూపాయల చేనేత కార్మికుల పెన్షన్ల ను అడ్డదారిలో దండుకుంటున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న చేనేత కార్మిక పెన్షన్ పథకాన్ని నకిలీ సర్టిఫికెట్లతో దుర్వినియోగపరుస్తున్నారు. నకిలీ చేనేత సర్టిఫికెట్ల జారీ దందాను అరికట్టాలని అసలైన చేనేత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

## గోదావరిఖని ప్రైవేట్ బడుల ఆగడాలు

- విద్యా వ్యాపారంలో నలిగిపోతున్న తల్లిదండ్రులు!
- ఫీజుల దోపిడీతో గుల్లవుతున్న సామాన్యుడి జేబులు
- టై, బెల్ట్, ఐడీ కార్డుల పేరుతోనూ అదనపు బాదుడు
- కనీస ఆట స్థలాలు లేకున్నా కట్టాల్సిందే భారీ ఫీజులు
- గత మూడేళ్లుగా శూన్యమైన జిల్లా విద్యాధికారి పర్యవేక్షణ
- అధికారుల ఉదాసీనతపై అనుమానాలు
- లంచాల కాటుకే విద్యాశాఖ నిద్రపోతోందా?




**ప్రజా వాయిస్ పెద్దపల్లి** విద్యను పవిత్రమైన సేవగా భావించాల్సిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, గోదావరిఖనిలో దానిని పక్కా వ్యాపారంగా మార్చేశాయి. చదువు చెప్పడం దేవుడెరుగు కానీ, రకరకాల పేర్లు చెప్పి తల్లిదండ్రుల రక్తాన్ని పిండుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నాయి. అడిగే నాథుడు లేకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాల ఆగడాలు రోజురోజుకూ సరిహద్దులు దాటుతున్నాయి. కేవలం ప్రవేశ రుసుములు, ట్యూషన్ ఫీజులతోనే ఆగకుండా... స్కూల్ టై, బెల్ట్, ఐడెంటిటీ కార్డులు, పుస్తకాలు, చివరికి యూనిఫారాల పేరుతో తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు పిండుకుంటున్నారు. బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులను, తమ స్కూళ్లలోనే అధిక ధరలకు కొనుగోలు చేయాలని నిబంధనలు విధిస్తూ సామాన్యుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు. "రక్తాన్ని దానం చేస్తే ఒక ప్రాణం నిలుస్తుంది, కానీ ఈ బడులు రక్తాన్ని గుంజి ప్రాణాలు తీస్తున్నంత పని చేస్తున్నాయి" అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆట స్థలాలు కరువు... బాదుడు మాత్రం యథావిధి

ద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా ఆట స్థలం (ప్లే గ్రౌండ్) ఉండాలి. కానీ గోదావరిఖనిలోని మెజారిటీ ప్రైవేట్ స్కూళ్లు ఇరుకైన భవనాల్లో, కనీసం గాలి వెలుతురు సరిగా రాని గదుల్లో కొనసాగుతున్నాయి. పిల్లలకు శారీరక వికాసాన్ని అందించే ఆట స్థలాలు కాగితాలకే పరిమితమయ్యాయి. సౌకర్యాలు సున్నా అయినా, ఏటా ఫీజుల పెంపు మాత్రం కొండంతగా ఉంటోంది. పెద్దపల్లి జిల్లా విద్యాధికారి పర్యవేక్షణ గత మూడేళ్లుగా పూర్తిగా శూన్యమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడం, ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. విద్యాశాఖ అధికారుల ఈ ఉదాసీనత వెనుక భారీగా లంచాలు చేతులు మారాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారులు మామూళ్ల మత్తులో ఊగుతుండటంతోనే ప్రైవేట్ యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనలను త్రోసిరాజన్లాయని విద్యార్థి సంఘాలు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





## శివపార్వతుల కల్యాణంతో పులకించిన వికారాబాద్

- కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా కల్యాణ మహోత్సవం

**ప్రజావాయిస్/వికారాబాద్:** పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేడుకలు సాగాయి.ఆలయ ధర్మకర్త, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, అర్థ ప్రభావతి దంపతులు కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 18000 ఇవ్వాలి
- పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను దారి మళ్లించిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం
- పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల ఒకటో తారీకుని జీతాలు చెల్లించాలి
- వీపనగండ్ల బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

**ప్రజా వాయిస్ .. విపనగండ్ల** మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు, వనపర్తి జిల్లా విపనగండ్ల గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై ఆదివారం నిరసన కార్యక్రమం చేయడం జరిగింది . బిఆర్ఎస్ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, వారికి తగిన గౌరవం 18000 జీతం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఆ హామీలను అమలు చేయకుండా పారిశుద్ధ్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస గౌరవ వేతనం రూ, 18000 వేల జీతం అందించకపోవడం బాధాకరమని అన్నారు. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల శ్రమను గుర్తించి వారికి గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, అవసరమైన రక్షణ పరికరాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పారిశుద్ధ్య కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వారి శ్రమకు తగిన గౌరవం ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీ మేరకు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని, కనీస గౌరవ వేతనం 18000 వెంటనే పెంచి చెల్లించాలని బి ఆర్ ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.పారిశుద్ధ్య కార్మికుల హక్కుల కోసం బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని బి ఆర్ ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, ముంత శివ, జొల్లు నారాయణ, ఏటూరి కురుమయ్య, శేఖర్ యాదవ్, మండల బాబు, మీసాల శివ, తోలు రామకృష్ణ,జుర్రు నారాయణ, జీపు కుర్మయ్య, ఎర్ర శేఖర్, వడ్డే రాజు, కొమ్ము గణేష్, రామస్వామి, బంగి శేఖర్, శేఖర్ రెడ్డి, గడ్డల లక్ష్మణ్, బండారి విష్ణు, మీసాల శివ, పాము మద్దిలేటి, నరసింహ, సంఘన మౌని శేషయ్య, కుమ్మరి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## న్యూడ్ ఫోటోలతో మహిళకు వేధింపులు?

- అధికార పార్టీ నేతపై తీవ్ర ఆరోపణలు
- పోలీసుల తీరుపై బాధితురాలి ఆవేదన





**ప్రజా వాయిస్, మఠంపల్లి, సెప్టెంబర్ 06** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బక్కమంతులగూడెంలో ఓ మహిళకు ఎదురైన వేధింపుల ఘటన కలకలం రేపుతోంది. కాంగ్రెస్ నాయకుడు చింతారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తనను లైంగికంగా వేధించారని, తాను ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడి తన ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించారని బాధితురాలి ఆరోపణలు వీడియో ద్వారా వైరల్ అయ్యాయి.తనకు వాట్సాప్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపుతూ తీవ్రంగా వేధించారని ఆమె పేర్కొంది. ఈ వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

### ఫిర్యాదు చేసినా న్యాయం దక్కలేదా?

బాధితురాలి ఆరోపణల ప్రకారం.. పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం కూడా తనపై ఒత్తిళ్లు కొనసాగాయి. నిందితుడితో రాజీ చేసుకుని కేసును వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.వేధింపులు, బెదిరింపులు తాళలేక బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అధికార పార్టీ నేత కావడంతోనే చర్యలు లేవా?

నిందితుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో పోలీసులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.ఒక మహిళపై లైంగిక వేధింపులు, ప్రైవేట్ ఫొటోలతో బెదిరింపులు వంటి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, బాధితురాలికి భద్రత కల్పించి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.బాధితురాలి ఆరోపణలు నిజమైతే.. రాజకీయ పలుకుబడితో నిందితుడు తప్పించుకునే అవకాశం లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## లారీని ఢీకొట్టిన డీసీఎం .. డ్రైవర్ మృతి

- రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం
- వెనుక నుంచి బలంగా ఢీకొన్న డీసీఎం

**ప్రజా వాయిస్,మోతే:** సూర్యాపేట,ఖమ్మం జాతీయ రహదారిపై మోతె మండలం రాఘవాపురం ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ పింటు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మోతె పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు.ఈ ఘటనపై మోతె ఎస్సై లచ్చిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీసీఎం అతివేగమే ప్రమాదానికి కారణమా.. లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## వాన కోసం "ఊరంతా" వనవాసం

- ఓ వరుణ దేవా! కరుణించి వర్షం కురిపించవా
- ప్రజల వేడుకోలు.
- ఒక్కొక్క కార్తెమో కదిలిపోతుంది
- పంటలేమో ఎండిపోతున్నాయి.

**ప్రజా వాయిస్/ఆత్మకూరు (ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) గ్రామ ప్రజలు వానలు కురియాలని "ఊరంతా" వనవాసం వెళ్లారు. జూన్ నెల మొదలుకొని సెప్టెంబర్ వరకు తేలికపాటి వర్షాలు తప్ప భారీ వర్షాలు కురియలేదు. కురిసిన తేలికపాటి వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పత్తి, ఆముదం, కందులు తోపాటు తదితర పంటలు వేశారు. రోజు రోజుకు కార్తులేమో కదిలిపోతున్నాయి. వేసిన పంటలేమో ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయో రావోనని రైతులు ఆందోళనలో పడ్డారు. వరి వేసిన రైతుల పొలాలు పొట్ట దశలో వచ్చిరాని కరెంటుతో ఎండు ముఖం పడుతున్నాయి. రోజురోజుకు బోరు బావులలో నీటిమట్టం తగ్గుతుంది. కరెంటు కష్టాలు తప్పడం లేదు. వర్షం ఎప్పుడు కురుస్తుందోనని ఆకాశం వైపు రైతు దీనంగా చూస్తున్నప్పటికీ వరుణుడు మోము చాటేస్తున్నాడే తప్ప కరుణించి భారీ వర్షం కురిపించడం లేదు. దీంతో పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయో రావో నని మదన పడుతున్న తీరు కనిపిస్తుంది. వానదేవుడు కరుణించి వర్షం కురిపించాలని 'ఊరంతా' వనవాసం పోయారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది.





## కోళ్ల కాళ్లకు కత్తులు - బెట్టింగ్ బరిలో జూదగాళ్లు.!

- మనెగూడలో,శంషాబాద్ టాస్క్ ఫోర్స్ -ఆదిభట్ల పోలీసుల మెరుపుదాడి
- 22 మంది అరెస్ట్ రూ.3.60 లక్షల నగదు,31 పందెం కోళ్లు స్వాధీనం
- 146 కోడి కత్తులు,20 సెల్ ఫోన్లు రూ.35 లక్షల విలువైన సామగ్రి సీజ్

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:** మనెగూడలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడి పందేల బెట్టింగ్ దందాపై శంషాబాద్ టాస్క్‌ఫోర్స్,ఆదిభట్ల పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడి చేశారు. ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న పాత పౌల్ట్రీ ఫామ్‌లో నిర్వహిస్తున్న బెట్టింగ్ స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించారు.దాడి సమయంలో కోడి పందేలు, పేకాటలో పాల్గొంటున్న 22 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పందేల కోసం ప్రత్యేకంగా కోళ్లను పెంచడంతో పాటు ఏపీతో పాటు వివిధ ప్రాంతాల నుంచి జూదరులను రప్పించి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.దాడిలో రూ.3,60,510 నగదు,31 పందెం కోళ్లు,146 కోడి కత్తులు,20 స్మార్ట్‌ఫోన్లు, పేక ముక్కలు,స్కోర్ నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు.మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేశారు.స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా, బెట్టింగ్ దందాకు ప్రధాన నిర్వాహకుడు,భూ యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించా రు. పట్టుబడిన 22 మందిని,స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి దర్యాప్తు కోసం ఆదిభట్ల పోలీసుల కు అప్పగించారు.కోడి పందేలు,జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ టాస్క్‌ఫోర్స్, ఆదిభట్ల పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.






# త్రిశంకు స్వర్గంలో సాగర్ ఎడమ కాలువ రైతులు!

- కాలువలో నీరు ఉన్నా చివరి మేజర్ కు చేరని జలాలు.. ఎండుతున్న పంటలు
- కోట్లతో సిమెంట్ లైనింగ్ పనులు... గండ్లతో ధ్వంసం
- కనిపించని NSP అధికారులు!
- మంత్రి ఉత్తమ్ గారూ..ఒక్కసారి చివరి ఆయకట్టు వరకు రండి అంటున్న రైతులు!
- లింగగిరి చెరువు అడుగంటుతోంది... పంటలు ఎండుతున్నయి
- మంత్రి సొంత జిల్లాలోనే సాగునీటి వ్యవస్థ ఇలా ఉంటే.. రైతుల గోడు ఎవరికి చెప్పాలి?

**ప్రజా వాయిస్,హుజూర్‌నగర్, సెప్టెంబర్ 6** నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి నీరు ఉన్నా పంటకు అందని.. కాలువ ఉన్నా చివరి భూమికి చేరని చందంగా మారిందనే ఆవేదన వ్యక్తమవుతోంది. కాలువలోకి నీటిని విడుదల చేసి వారం రోజులు దాటుతున్నా, అనేక మేజర్ల చివరి ఆయకట్టు వరకు నీరు చేరకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తుంటే.. మరోవైపు ఇప్పటికే సాగు చేసిన పొలాలు నీరందక ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

### వారమైంది.. నీరు మాత్రం చివరి మేజర్ కు దూరమే!

సాగర్ ఎడమ కాలువలో నీటి విడుదల జరిగిందనే సమాచారం రైతుల్లో ఆశలు రేకెత్తించింది. అయితే ఆ ఆశలు ఆయకట్టు చివరి ప్రాంతాలకు చేరేసరికి నిరాశగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. కాలువలో నీరు వదిలి రోజులు గడుస్తున్నా మేజర్ల చివరి భూములకు నీరు ఎందుకు చేరడం లేదనే ప్రశ్నకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు.కాలువల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎక్కడైనా అడ్డంకులు ఉంటే తొలగించి, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యవేక్షిస్తున్నారనే ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

### కోట్ల రూపాయల సిమెంట్ లైనింగ్ కు ఇదేనా ఫలితం?

కాలువల్లో నీటి వృథాను అరికట్టేందుకు, ఆయకట్టు రైతులకు సమర్థవంతంగా నీటిని అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టింది. కానీ కొన్ని ప్రాంతాల్లో లైనింగ్ పనులు పూర్తయిన కొద్దికాలానికే అవి దెబ్బతినడం, గండ్లు ఏర్పడటం, కాలువలకు అడ్డంగా మార్పులు చోటు చేసుకోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన కాలువలు కొద్దిరోజులకే ధ్వంసమైతే బాధ్యత ఎవరిది?నాణ్యత లోపమా? నిర్వహణ వైఫల్యమా? లేక కాలువలను అక్రమంగా ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కాలువలకు గండ్లు పెట్టి నీటిని మళ్లిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడ ఉన్నారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు తీసుకునే యంత్రాంగం కనిపించకపోవడం వెనుక కారణమేంటో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

### లింగగిరి చెరువు అడుగంటుతోంది.. ఇంకెన్ని చెరువుల పరిస్థితి ఇదే?

సాగర్ జలాలు వస్తున్నా స్థానిక చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండకపోవడం మరో ఆందోళనకు కారణంగా మారింది. లింగగిరి చెరువు అడుగంటుతున్న పరిస్థితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో మరెన్నో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు.సాగునీటి వనరులన్నింటినీ సమన్వయంతో నిర్వహించాల్సిన NSP యంత్రాంగం క్షేత్రస్థాయిలో కనిపించకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టి సారించాల్సిన సమయం ఇదే!

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా సాగర్ ఎడమ కాలువ పరిధిలో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందకపోతే, కేవలం కాలువలో నీరు విడుదల చేశామని చెప్పుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.నీరు విడుదల చేశాం అనే ప్రకటనలతో రైతుల పొలాలు పండవు. ఆ నీరు చివరి రైతు పొలానికి చేరినప్పుడే ప్రభుత్వ ప్రయత్నానికి అర్థం ఉంటుంది. మంత్రి స్వయంగా ఒకసారి మేజర్ చివరి వరకు పర్యటించి, కాగితాలపై ఉన్న లెక్కలకు.. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు ఎంత తేడా ఉందో చూడాలని రైతులు కోరుతున్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కాలువల పరిస్థితి, మేజర్ల చివరి ఆయకట్టు, చెరువుల నీటిమట్టాలు, లైనింగ్ పనుల నాణ్యత, కాలువలకు గండ్లు పెడుతున్న వారి వ్యవహారం, NSP సిబ్బంది పర్యవేక్షణపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తే అసలు పరిస్థితి వెలుగులోకి వస్తుందని రైతులు అంటున్నారు.

### అధికారులు.. నాయకులు ఒక్కసారి చివరి మేజర్ వరకు వస్తే!

ఎయిర్ కండిషన్డ్ కార్యాలయాల్లో కూర్చొని కాలువల్లో నీరు ప్రవహిస్తోందని నివేదికలు తీసుకోవడం ఒకటైతే.. మేజర్ చివరి ఆయకట్టు వద్ద నిలబడి రైతు పొలం వైపు చూడటం మరో విషయం.ఒక్కసారి అధికారులు, ప్రజాప్రతినిధులు, NSP ఉన్నతాధికారులు మేజర్ చివరి వరకు వెళ్లి చూస్తే.. రైతుల అసలు కష్టం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందని స్థానికులు అంటున్నారు.ఇప్పటికే సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతున్న వేళ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ ఇకనైనా మేల్కొని చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా తక్షణ చర్యలు చేపట్టాలని, దెబ్బతిన్న కాలువ లైనింగ్‌ను మరమ్మతు చేయాలని, గండ్లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలకు నీరు చేరేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.లేకపోతే సాగర్ జలాలు వచ్చాయి అనే మాట మిగిలిపోతుంది.. కానీ రైతు పొలంలో మాత్రం పంట కనిపించని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.




# ములుగు జిల్లా యాదవ సంఘం ఐక్యవేదిక ఏర్పాటు

- యాదవుల రాజకీయ హక్కుల కోసం ములుగు నుంచే ఉద్యమానికి నాంది
- యాదవుల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి.
- యాదవ సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్..

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా సెప్టెంబర్ 6:/** ములుగు జిల్లాలో యాదవ కులబాంధవుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జిల్లా యాదవ సంఘం ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లాలోని 12 మండలాలకు చెందిన యాదవ కులబాంధవులు, బాధ్యులు హాజరై సమాజ అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, సమస్యల పరిష్కారంపై చర్చించారు."యాదవుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం దేశవ్యాప్త పోరాటానికి ములుగులో నాంది పలుకుతున్నాం" అని వంగ రవి యాదవ్ తెలిపారు. యాదవుల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా, అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

### యాదవుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం:

యాదవ కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు అందేలా అవగాహన కల్పించి సహకరించాలని సమావేశంలో నిర్ణయించారు. పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు పరస్పర సహాయ సహకారాలు అందించడం, విద్యార్థులను ప్రోత్సహించడం, యువతకు ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు."ఎవరికి ఏ సమస్య వచ్చినా మన సంఘం అండగా ఉంటుంది. మన కోసం మనం నిలబడాలి" అని నాయకులు పిలుపునిచ్చారు. యాదవ సంఘం ఐక్యవేదికలో భాగంగా జిల్లా స్థాయిలో 15 మంది సభ్యులతో తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో 2 నుంచి 3 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో యాదవులను సంఘటితం చేయాలని నిర్ణయించారు.

### జిల్లా కమిటీ:

1. వంగ రవి యాదవ్ – అధ్యక్షులు2. పిండి రవి యాదవ్ – గౌరవ సభ్యులు3. వసంత్ శ్రీనివాస్ యాదవ్4. జక్కుల రేవంత్ యాదవ్5. బాషబోయిన పోశాలు యాదవ్6. ఇమ్మడి రాకేష్ యాదవ్7. సుంకరబోయిన మొగిలి యాదవ్8. నూనెటి శ్యామ్ యాదవ్9. బొచ్చు వెంకన్న యాదవ్10. గొర్రె కుమారస్వామి యాదవ్11. గుండెబోయిన అనిల్ యాదవ్12. పాక సాంబయ్య యాదవ్13. అల్లంల చంటి యాదవ్14. కొట్టెకొల్ల వెంకటేష్ యాదవ్యాదవుల ఐక్యత, రాజకీయ హక్కులు, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి కోసం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి, రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి సమష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# ఒకే ఇంట్లో ఉన్నా..ఒంటరిగానే!

- మనుషుల మధ్యే పెరుగుతున్న ఒంటరితనం
- బంధాలు ఉన్నా.. భావోద్వేగాలకు దూరం
- ఇల్లు ఎంత పెద్దదైనా.. ప్రేమ, ఆప్యాయతలు లేకపోతే అది కేవలం నివాసమే



**ప్రజావాయిస్ ప్రత్యేక కథనం/** వికారాబాద్:ఒకప్పుడు కుటుంబమంటే ఆప్యాయతలు, అనుబంధాలు, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మనుషులు. కానీ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఇంట్లో మనుషుల సంఖ్య పెరుగుతున్నా.. మనసుల మధ్య దూరం మాత్రం పెరుగుతోంది. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఎవరి ప్రపంచంలో వారు జీవిస్తున్నారు. ఉదయం లేవగానే సెల్‌ఫోన్.. పనులు, ఉద్యోగాలు, చదువులు అంటూ ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతల్లో మునిగిపోతున్నారు. ఇంట్లో అందరూ ఉన్నా మాట్లాడుకునే సమయం కరువవుతోంది. పక్కనే ఉన్న మనిషితో మాట్లాడేందుకు కూడా ఫోన్‌నే ఆశ్రయించే పరిస్థితి నెలకొంది.వృద్ధులకు పిల్లలు ఉన్నా వారి కోసం సమయం కేటాయించలేని పరిస్థితి. తల్లిదండ్రులకు పిల్లలతో మాట్లాడాలనిపించినా.. పిల్లలకు తీరిక ఉండదు. యువతకు స్నేహితులు, సోషల్ మీడియా ఉన్నా మనసులోని బాధను పంచుకునే ఆత్మీయులు లేక ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు.

### ఇల్లు పెద్దదైనా.. ప్రేమ ఆప్యాయతలు లేకపోతే!

ఇల్లు పెద్దదైనా.. అందులో ప్రేమ, ఆప్యాయతలు లేకపోతే అది కేవలం నివాసమే. కుటుంబం అంటే ఒకే కప్పు కింద ఉండటం కాదు.. ఒకరి మనసుకు మరొకరు తోడుగా నిలవడం. ఆ అనుబంధాలను తిరిగి పెంచుకుంటేనే "ఇంట్లో ఎందరు ఉన్నా.. ఒంటరిగా ఉన్నాం" అనే భావనకు ముగింపు పలకగలం.



# విష జ్వరాల విజృంభణతో ప్రభుత్వాసుపత్రికి క్యూ

- వైరల్ ఫీవర్లతో పెరుగుతున్న రోగుల తాకిడి
- రోజూ వందలాది మంది ఓపీకి
- పెరిగిన ఇన్ పేషెంట్ అడ్మిషన్లు

**ప్రజా వాయిస్ దోమకొండ**, సెప్టెంబర్ 6దోమకొండ పరిసర మండలాలలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లు విజృంభిస్తుండటంతో దోమకొండ ప్రభుత్వాసుపత్రికి రోగుల తాకిడి భారీగా పెరిగింది. జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం తదితర లక్షణాలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుంటున్నారు. దీంతో ప్రతిరోజూ ఓపీ విభాగం రోగులతో కిటకిటలాడుతోంది.జ్వరంతో వచ్చే ప్రతి రోగికి వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఆసుపత్రి ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించి, పరీక్షల నివేదికల ఆధారంగా చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని బట్టి మందులు సూచిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు.పెరిగిన ఓపీ.. రెట్టింపైన అడ్మిషన్లుఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ప్రభుత్వాసుపత్రిలో 400కు పైగా ఓపీ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. రోజురోజుకూ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్య సిబ్బందిపై కూడా పనిభారం పెరిగింది. మరోవైపు గత నెలతో పోలిస్తే ఇన్‌పేషెంట్ అడ్మిషన్ల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తోంది.విద్యార్థులకు జనరల్ చెకప్‌సంగమేశ్వర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జనరల్ చెకప్ కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, తాగునీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.జాగ్రత్తలు పాటించాలివైరల్ ఫీవర్లు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.

# విలోచవరంలో దశాబ్దాల మురుగు సమస్యకు తెర!

**ప్రజా వాయిస్ మంథని** పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామంలో చాలాకాలంగా వేధిస్తున్న మురుగు నీటి సమస్యకు సర్పంచ్ కొండ ప్రేమలత రవీందర్ శాశ్వత పరిష్కారం చూపారు.గ్రామంలోని రెండు వార్డుల మధ్య నిల్వ ఉండి, దుర్గంధం వెదజల్లుతున్న మురుగు నీటి కారణంగా చుట్టుపక్కల ప్రజలు ఈగలు, దోమలు, పాముల భయంతో తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్‌గా గెలిచిన నాటి నుంచి ఈ సమస్యను తీర్చాలని భావించినప్పటికీ, గతంలో ఒక అధికార పార్టీ నాయకుడి అడ్డంకులు, నెరవేరని హామీల వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ కొండ ప్రేమలత రవీందర్ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. గుంతలు తవ్వి, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి, నిలిచిపోయిన మురుగు నీరు సఫీగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్య తీరడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# గంజాయిపై పోలీస్ ల ఉక్కుపాదం

- ఎలిగేడ్ లో ఏడుగురు యువకులు అదుపులోకి
- వైద్య పరీక్షల అనంతరం డీ-అడిక్షన్ సెంటర్ కు తరలింపు
- తల్లిదండ్రులు, ప్రజలు పోలీసులకు సహకరించాలి
- సీపీ అంబర్ కిషోర్ ఝా

**ప్రజా వాయిస్ ఎలిగేడ్రామగుండం** కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో ఎస్ఐ లక్ష్మణ్, ఎలిగేడ్ మండల్ ఎస్ఐ మధుకర్ బృందాలు శనివారం ఉదయం పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ గ్రామంలో సంయుక్తంగా పెట్రోలింగ్ నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు గంజాయి సేవించినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. నివేదికల ఆధారంగా వారిని తదుపరి కౌన్సెలింగ్, పునరావాసం కోసం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

### మత్తు పదార్థాలపై ఉపేక్షించేది లేదు: సీపీ

యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, నిల్వలపై కఠినంగా వ్యవహరిస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. గంజాయి మహమ్మారికి యువత బానిస కాకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

- జిల్లా వ్యాప్తంగా 1216 దరఖాస్తులు
- 1030 మంది అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్ కు హాజరు
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.

**ప్రజా వాయిస్ కొత్తగూడెం.**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్-ఇన్స్పెక్టర్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఉచిత శిక్షణ కోసం 1216 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 1030 మంది స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష ప్రశాంతంగా, క్రమబద్ధంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. జిల్లాలోని ఐదు సబ్-డివిజన్ల పరిధిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తగూడెం సబ్-డివిజన్‌లో సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, పాల్వంచ సబ్-డివిజన్‌లో అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణను పరిశీలించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అర్హులైన అభ్యర్థులకు కానిస్టేబుల్, సబ్-ఇన్స్పెక్టర్ నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్య పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచే విధంగా సమగ్ర శిక్షణ, అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు.పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పాటు క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణలో చురుకుగా పాల్గొని, నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో సబ్-డివిజన్ పోలీస్ అధికారులు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# కాగితాల్లో పచ్చదనం.. రోడ్డుపై జిల్లేడు వనం!

- డివైడర్లలో కనుమరుగైన మొక్కలు
- ఏపుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలు
- నిర్వహణకు కేటాయించిన నిధులు ఎటు పోతున్నాయి?
- మొక్కలు నాటడమేనా.. మారి సంరక్షణ ఎవరి బాధ్యత?

**ప్రజా వాయిస్ ఖమ్మం:** ప్రభుత్వ నిధులతో రహదారుల మధ్య నిర్మించిన డివైడర్లు ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారుతున్నాయి. ఒకప్పుడు పచ్చని మొక్కలతో కళకళలాడిన డివైడర్లు.. నేడు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, జిల్లేడు చెట్లతో నిండిపోతున్నాయి. మొక్కలు నాటేందుకు, వాటి నిర్వహణకు ఏటా నిధులు కేటాయిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తుండటంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.హరితహారం, పర్యావరణ దినోత్సవాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో మొక్కలు నాటడం.. వాటితో ఫొటోలు దిగడం.. ఆ తర్వాత వాటి సంరక్షణను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయి? ఎన్ని ఎండిపోయాయి? వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటారా? వాటికి నీరు పోస్తున్నారా? రక్షణ చర్యలు చేపడుతున్నారా? అన్న ప్రశ్నలకు క్షేత్రస్థాయిలో స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు.ప్రతి ఏటా పచ్చదనం, మొక్కల పెంపకం, నిర్వహణకు సంబంధించిన లెక్కలు అధికారిక రికార్డుల్లో నమోదవుతున్నా.. రహదారులపై కనిపిస్తున్న దృశ్యాలు మాత్రం ఆ లెక్కలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.మొక్కలు పెంచాల్సిన డివైడర్లలోనే జిల్లేడు చెట్లు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో డివైడర్ల అసలు రూపమే మారిపోవడంతో పాటు వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది.మొక్కల పరిస్థితి మాత్రమే కాదు.. డివైడర్ల నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. పలుచోట్ల డివైడర్ అంచులు నెర్రలు చాచాయి. సిమెంట్ దిమ్మెలు విరిగిపోయాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు దెబ్బతిని ప్రమాదకరంగా మారుతున్నాయి.ఒకవైపు పచ్చదనం పేరుతో నిధులు ఖర్చవుతున్నట్లు రికార్డులు చెబుతుంటే.. మరోవైపు అదే పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన డివైడర్లు శిథిలావస్థకు చేరడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.డివైడర్లలో మొక్కల పెంపకం, నీటి సరఫరా, మొక్కల సంరక్షణ, కలుపు మొక్కల తొలగింపు, డివైడర్ల మరమ్మతులకు ఇప్పటివరకు ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? ఏ సంస్థకు లేదా ఏ ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు? పనులు వాస్తవంగా జరిగాయా? అనే అంశాలపై సమగ్ర పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది.రికార్డుల్లో చూపుతున్న మొక్కల సంఖ్యకు.. క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కల సంఖ్యకు మధ్య తేడా ఉందా? నిర్వహణ పేరుతో విడుదలైన నిధులకు అనుగుణంగా పనులు జరిగాయా? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.డివైడర్ల నిర్వహణకు సంబంధించి గత కొన్నేళ్లుగా కేటాయించిన నిధులు, చేసిన ఖర్చులు, నాటిన మొక్కల సంఖ్య, వాటి సర్వైవల్ రేటు, నిర్వహణకు బాధ్యత వహించిన సంస్థలు, చేపట్టిన పనుల వివరాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.శిథిలమైన డివైడర్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి.. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించి.. వాటి స్థానంలో నాణ్యమైన మొక్కలు నాటి నిరంతర సంరక్షణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కాగితాల్లో పచ్చదనం కనిపిస్తే సరిపోదు.. ఆ పచ్చదనం రహదారులపై కూడా కనిపించాలి. ప్రజాధనంతో నాటిన ప్రతి మొక్క బతికేలా చూడటం అధికారుల బాధ్యత.

# ఓఆర్ఆర్‌పై నిర్లక్ష్యం ప్రాణాలకు ముప్పు.!

- రోడ్డుపై వాహనాలు నిలిపితే ప్రమాదం తప్పదు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- వాహనదారులకు ఇన్ స్పెక్టర్ ప్రమోద్ కుమార్ సూచన

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపడం, పార్కింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.ఓఆర్ఆర్ ఎంట్రీ,ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు,ఐఆర్‌బీ అధికారులు సంయుక్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపవద్దు,పార్కింగ్ చేయవద్దు'అనే సందేశంతో కూడిన కరపత్రాలను వాహనదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ..ఓఆర్ఆర్‌పై వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుంటాయని, రోడ్డుపై వాహనాన్ని నిలపడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.వాహనాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు.వేగ నియంత్రణతో పాటు లేన్ క్రమశిక్షణ,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.ఓఆర్ఆర్‌పై రాకపోకలు సురక్షితంగా, సజావుగా సాగేందుకు ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ సూచించారు.




# ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- ముత్యాలమ్మ తల్లికి పట్టు వస్త్రాల సమర్పణ
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- బంగారు బోనం సమర్పించిన మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ
- పద్మశాలి వనభోజనాల్లో ఆత్మీయ కలయిక.
- సమాజ అభివృద్ధికి సహకరిస్తానని హామీ



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**శ్రావణమాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని మిర్యాలగూడ పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కల్లాలవాడలోని ప్రసిద్ధ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) సతీసమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.అనంతరం మిర్యాలగూడ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని పద్మశాలి బంధుమిత్రులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రతి ఒక్కరి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ వారితో కలిసిమెలిసి గడిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ఆత్మీయతను పెంపొందించేలా నిర్వహించే కార్యక్రమాలు సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పద్మశాలి సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని భరోసా ఇచ్చారు. ఒకవైపు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే.. మరోవైపు సామాజిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, సంఘాల ప్రతినిధులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ... రికార్డుల పరిశీలన

- అవకతవకలకు తావు లేకుండా చూడాలి
- ఆరుతడి పంటల పై అవగాహన జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర

**ప్రజా వాయిస్ బయ్యారం..** మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండల పరిధిలోని గంధం పల్లి - కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎరువుల డీలర్లు తప్పనిసరిగా నిర్వహించాల్సిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.అనంతరం సంతులాల్‌పోడు తండాలోని చాగర్లమూడి భాస్కర్ పెసర పంట పొలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీటి ఆధారిత పొడి పంటలు, తక్కువ నీటితో సాగు చేయగల ఇతర పంటలను చేపట్టాలని రైతులకు సూచించారు.తదుపరి బయ్యారం గ్రామానికి చెందిన సుంకర రాజాసాగు చేస్తున్న పెసర పంట పొలాన్ని సందర్శించారు. విజయవంతంగా పెసర సాగు చేస్తున్న రైతును అభినందించి, ఇతర రైతులు కూడా పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు...



# మున్సిపల్ అధికారులకు ఇంత నిర్లక్ష్యం దేనికి

- వార్త కథనాలు వచ్చినా స్పందించని మున్సిపల్ అధికారులు
- పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యాన్ని వీడి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిని ఆనుకుని చెట్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోతున్న విషయంపై ఇటీవల వార్త కథనాలు వెలువడినా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పట్టించుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.రహదారి వెంట చెట్లపొదలు పెరగడంతో దోమలు, పాములు వంటి వాటికి ఆవాసాలుగా మారే ప్రమాదం ఉందని, ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పారిశుద్ధ్యం, వసతుల విషయంలో మున్సిపల్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రహదారి వెంట పెరిగిన చెట్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి



- జలాధివాసం, ధాన్యాధివాసం
- ప్రత్యేక పూజలు, హోమాలతో ఆధ్యాత్మిక సందడి
- నేడు వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



**ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట:** మల్కాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాధివాసం, ధాన్యాధివాసంతో పాటు హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన పూజా కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తూ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.నేడు ప్రతిష్ఠాపన మహోత్సవంపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ప్రతిష్ఠాపన మహోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు కోరారు.

# అక్టోబర్ 7న, ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేయాలి

**ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ**

**అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం..**

ప్రజా వాయిస్ /ఆత్మకూరు (ఎం):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్ పి మండల స్థాయి సమావేశం నల్ల చంద్ర స్వామి మాదిగ, మందుల లింగ స్వామి మాదిగల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 7న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి లో జరుగబోయే జాతీయ ఎంఆర్పిఎస్, ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమాజ నిర్మాణకై ముందుకు నడువాలని అన్నారు. అనంతరం ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సామాజిక, ఆర్థిక అసమానతల పై భవిష్యత్ ఉద్యమం జరుగుతుందని సమాజం లో అందరిని కలిపి ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మార్పియస్, ఎంఎస్పీ,ఎమ్మెసేఫ్, మాదిగ మహిళ సమాఖ్య,మండల,పట్టణ కమిటీల ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ నాయకులు మాదిగ ప్రజా ప్రతినిధులు గడ్డం ముత్తమ్మ, కానుకుంట్ల యాదగిరి మాదిగ, సుంకిశాల ఎల్లయ్య మాదిగ, వస్తుపుల జంగులు మాదిగ,గట్టు శేఖర్ మాదిగ,గట్టు రాజు మాదిగ, కొంగరి విద్యాసాగర్ మాదిగ, వేముల గణేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# మోస పూరిత హామీలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ సర్కార్

**-హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం**
**- ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఎక్కడ**
**-కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు**
**-కరెంటు కష్టాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు**

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కి ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు నాగులపల్లి దేవగిరి, సర్పంచ్ పూజారి వనజ సైదులు గౌడ్ అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీల బాకీ కార్డులతో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం



ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేపట్టినప్పటి నుండి గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని అన్నారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సరిపడా కరెంటు ఇవ్వకుండా కరెంటు కోతలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. తక్షణమే రైతులకు వ్యవసాయ రంగానికి సరిపడా కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలపై బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గజ్జెల్లి రవి, గూడెపు పరమేష్, బాలెంల బాబు మహజన్, లోకేష్, రమేష్, బీరప్ప, అరవింద్, మహేష్, పరుశురాములు, ప్రవీణ్, పరశు రాములు, కొమురయ్య, మధు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# దోమకొండ లో బిఆర్ఎస్ కార్యకర్తల నిరసన

ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 6
దోమకొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై పారిశుద్యానికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైనా ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ 420 మోసాలపై బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోదలుపెట్టిందని ఇచ్చిన గ్యారంటీల బాకీ కార్డును ప్రజలకు అందజేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెలు పారిశుద్ధ్య నిర్వహణ లేకపోగా గ్రామ పంచాయతీకి రావలసిన ఫైనాన్స్ కమిషన్ గ్రాంటు ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులలో ఒక్కసారి కూడా విడుదల చేయలేదని,గ్రామపంచాయతీ సపాయి కార్మికులకు జీతాలను ప్రభుత్వ అధికారులతో సమానంగా ఇస్తామని చెప్పి ఇప్పటికి పంచాయతీ సాధారణ నిధుల నుండి ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ఊరుకునే ప్రసక్తే లేదని ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వ వైఖరిపై పోరాటం చేస్తామని తెలియజేసారు ఈ నిరసన కార్యక్రమంలో దోమకొండ మండల తాజా మాజీ అధ్యక్షుడు గంద్ర మధుసూదన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచాల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్,యువజన అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, మాజీ ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ బోరెడ్డి నాగరాజు,సీనియర్ నాయకులు ఆశంశెట్టి



పోచయ్య,కుంచాల సత్యనారాయణ,చిట్యాల రాజిరెడ్డి,అనుమల అశోక్, బొబ్బసాని శంకర్ వార్డు సభ్యుడు బీస్ సతీష్, కార్యకర్తలు బుర్రి రవి,అంకత్ జగదీష్ పాల్గొన్నారు.

# అనుమతులు ముడంతస్తులకు నిర్మాణాలు మాత్రం ఆరంతస్తులు

**భవనాలను సీజ్ చేసిన కొనసాగుతున్న పనులు**
**అధికారుల మౌనం వెనుక రహస్యామెంటి**
**రాజకీయ నాయకుల అండతోనే నిర్మాణాలా ?**
**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న**
**అక్రమ నిర్మాణాల వ్యవహారం**
**చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల డిమాండ్**





పటాన్ చెరువు ప్రజావాయిస్
పటాన్ చెరువు నియోజకవర్గంలోని ప్రభుత్వ నిబంధనలు భేఖాతారు చేస్తూ అనుమతులకు మించి భారీ భవన నిర్మాణాలు చేపట్టిన పలు భవనాలకునోటీసులు ఇచ్చి సిజ్ చేసిన ఆగని భవన నిర్మాణాలు ఎద్దేచ్ఛగాకొనసాగిస్తునారు పటన్ చెరువు నియోజకవర్గం లోని అమీన్పూర్ ఇంద్రేశం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న ఘనాపూర్ వెలిమల తదితర ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అనుమతులకు మించి భారీ భవనాలను నిర్మించిన కొందరి బడా బాబులకు నోటీసులు ఇచ్చిన భవనాలను సీజ్ చేసిన గాని అవేమీ లెక్క చేయకుండా ఇష్టానుసారంగా చేపడుతున్న భారీ భవన నిర్మాణాలకు జి ప్లస్ టు అనుమతులు ఇచ్చిన కొందరు బడా బాబులు అవేమీ పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు అనుమతులకు మించి భారీ బహుళ అంతస్తుల నిర్మాణంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్న కొందరు అక్రమ భవన నిర్మాణదారులు అమీన్పూర్ ఇంద్రేశం కిష్టారెడ్డిపేట్ ఘనపూర్ తదితరప్రాంతాల్లో ప్రాంతంలో



భారీగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు మించి భారీ భవన నిర్మాణాలు జరుగుతున్న పనులు కొనసాగిస్తున్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది జి ప్లస్ టు పర్మిషన్లు ఉన్నప్పటికీ పైన భారీ అంతస్తులతో ఎలాంటి అనుమతులు లేకుండా కొన్నిచోట్ల కొందరు అనుమతి తీసుకున్న నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న అటువైపు కనీసం కన్నెత్తి చూడని అధికారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని స్థానికులు వాపోయారు ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు చేపడుతున్నారని దీనివల్ల పరిసర భవనాల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు పన్నులు తప్పించుకునేందుకు కొంతమంది బిల్డర్లు తాము ఆడిందే ఆట పాడింది పాటగా దర్జాగా అక్రమ మార్గాలు అనుసరిస్తున్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్ ఎం డి ఏ మున్సిపల్ అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపటాల్సి ఉన్నప్పటికీ అదనపు పన్నులు తప్పించుకునేందుకు కొందరు బిల్డర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి దీనికి స్థానికంగా పూర్తి స్థాయిలో పూర్తి సహకారం ఉందనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయ నష్టం కలుగుతోందని భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు డ్రైనేజీ ఇబ్బందులు ప్రజా భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదని ఇప్పటికైనా ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై స్థానిక ఎమ్మార్వో గాని టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడంలేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మాజి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సంగారెడ్డి ఎమ్మెల్యేలు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశం అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు.బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజల సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాటం చేయాలి. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పనిచేసేందుకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా ముందుకు సాగాలి .సమావేశంలో మ్మెల్యే లు కొత్త ప్రభాకర్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# 100 శాతం హాజరు.. అంకితభావానికి గుర్తింపు

**మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా శివరామకృష్ణ ఎంపిక**

ప్రజా వాయిస్ - మందమర్రి, సెప్టెంబర్ 6:
మందమర్రి పట్టణాన రెబ్బన మండల కేంద్రంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మామిండ్ల శివరామకృష్ణ 2025 సంవత్సరంలో ఒక్క క్యాజువల్ లీవ్ కూడా వినియోగించుకోకుండా 100 శాతం హాజరుతో విధులకు హాజరై, ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకున్న అంకితభావాన్ని శివరామకృష్ణ చాటుకున్నారని, విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయడం అభినందనీయమని ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ మోతె రాజలింగు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వారిలో క్రమశిక్షణ, సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ శివరామకృష్ణ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పాఠశాల అభివృద్ధిలోనూ తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో విద్యార్థుల అభ్యున్నతి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.





# సుల్తానాబాద్ లయన్స్ సేవా నాయకులకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

**- బెస్ట్ జీఈటీ గా మిట్టపల్లి ప్రవీణ్ కుమార్**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో రామగుండంలో నిర్వహించిన 'సేవాభినందన 10వ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ సెలబ్రేషన్స్' కార్యక్రమంలో సుల్తానాబాద్‌కు చెందిన పలువురు లయన్స్ నాయకులు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు.సుల్తానాబాద్‌కు చెందిన ప్రముఖ బీజేపీ నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ కు బెస్ట్ జీఈటీ అవార్డు, జూలూరి అశోక్ కు బెస్ట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అవార్డు, జూపల్లి తిరుమల రావుకు బెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ అవార్డు, సుధీర్ రావుకు బెస్ట్ సెక్రటరీ అవార్డు, సతీష్ కు బెస్ట్ ట్రెజరర్ అవార్డు లభించాయి. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహరాజు కోదండరాం మాట్లాడుతూ.. సుల్తానాబాద్ లయన్స్ క్లబ్‌కు చెందిన నాయకులు సమాజ సేవలో విశేషంగా సేవలందిస్తూ, ప్రజలకు అండగా నిలుస్తున్నారని అభినందించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు.అవార్డులు అందుకున్న నాయకులను సుల్తానాబాద్‌కు చెందిన లయన్స్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రముఖులు అభినందించారు.



# కొన్నూరు మాజీ సర్పంచ్ అంజన్న యాదవ్‌కు ఘన నివాళి

ప్రజా వాయిస్, వనపర్తి:
మదనపురం మండలం కొన్నూరు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అంజన్న యాదవ్ మృతదేహానికి అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ ఘన నివాళులర్పించారు. అనారోగ్యంతో కొత్తకోట పట్టణంలోని రాహుల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంజన్న యాదవ్ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సతీష్ యాదవ్ కొన్నూరు గ్రామానికి చేరుకుని అంజన్న యాదవ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు న్యాయవాది కే. రాములు యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ నాకొండ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముంత లక్ష్మయ్య యాదవ్, టీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సత్యం యాదవ్, ఆశన్న యాదవ్, పాలెం మాజీ ఉపసర్పంచ్ జయరాములు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. అంజన్న యాదవ్ టీడీపీ సీనియర్ నాయకుడిగా, రావుల చంద్రశేఖర్ రెడ్డికి నమ్మిన అనుచరుడిగా కొనసాగుతూ సర్పంచిగా ఎన్నికై గ్రామ ప్రజలకు విశేష సేవలందించారని అన్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అంజన్న యాదవ్ మృతి గ్రామానికి, ఆయన అభిమానులకు తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.



## అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక.. ప్రజల కోసం పోరాటంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్!

ప్రజా వాయిస్ గోదావరిఖని
?గత మూడు రోజుల నుండి తీవ్రమైన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నప్పటికీ, నాయకుడి బాధ్యతే ముందని భావించారు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్. సొంత ఆరోగ్యం కంటే ప్రజల హక్కులు, పార్టీ పిలుపే ముఖ్యమని నమ్మి ఆటో కార్మికుల సమస్యలపై నిర్వహించిన ర్యాలీలో ఆయన నేరుగా పాల్గొన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రచార వాహనంపై నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గళమెత్తారు. ఈ పోరాట సమయంలో ఆరోగ్యం క్షీణించి తీవ్ర అస్వస్థతకు గురైనప్పటికీ, ఆయన చూపిన చొరవను పార్టీ శ్రేణులు కొనియాడుతున్నాయి. ప్రస్తుతం ఆయన మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నారు.



## వలస నీలయ్యకు ఉత్తమ సేవా రత్న అవార్డు

ప్రజా వాయిస్ సుల్తానాబాద్ :
వరంగల్‌లోని ఎస్‌వీఎస్ క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నేతన్న టీవీ అవార్డు కార్యక్రమంలో వలస నీలయ్యకు ఉత్తమ సేవా రత్న అవార్డు లభించింది. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు అందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామర్తపు మురళి చేతుల మీదుగా నీలయ్య ఈ అవార్డును అందుకున్నారు.అవార్డు అందుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని వలస నీలయ్య తెలిపారు. తనను అవార్డుకు ఎంపిక చేసిన నేతన్న టీవీ సీఈవో రాజేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అవార్డు అందించిన అందగట్ల స్వామి, కామర్తపు మురళి, అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బత్తుల నరేష్ యాదవ్‌కు ఘన సన్మానం

ప్రజా వాయిస్.. వీపనగండ్ల
వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన బత్తుల నరేష్ యాదవ్ వనపర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో బీఆర్ఎస్ యువ నాయకుడు బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేష్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బాబు రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై పుల్గర్‌చర్ల గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన నరేష్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు.ఒక వైద్యుడు శరీరానికి స్వస్థత చేకూర్చగలడని, ఇంజనీర్ భవనాన్ని నిర్మించగలడని, రైతు పంటను పండించగలడని, కానీ ఒక మంచి ఉపాధ్యాయుడు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దగలడని అన్నారు. అమ్మ జన్మనిస్తే.. జీవితాన్ని ఎలా జీవించాలో నేర్పించి, సరైన మార్గాన్ని చూపించేది ఉపాధ్యాయుడేనని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన నరేష్ యాదవ్ రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయిలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని బాబు రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వడ్డే తిరుపతయ్య, నరేష్, వడ్డే శీను, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేరు మార్చి,జీతం కత్తిరిస్తే ఎలా?

**రూ.500 నుంచి రూ.14 వేల వరకు వేతన కోతలు**

**అన్ని శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకెళ్లాలని నిర్ణయం**

**హనుమకొండలో రాష్ట్రస్థాయి కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం**

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. వేతనాల్లో కోతలు, హోదాల మార్పులు, ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.రూ.500 నుంచి రూ.14,000 వరకు వేతనాలు తగ్గుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల హోదా పేరు



మార్చి వేతనం తగ్గించడం ఎంతవరకు న్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.పని మాత్రం పాతదే, బాధ్యతలు పాతవే, అనుభవం పాతదే, పేరు మార్చగానే జీతం ఎందుకు తగ్గాలి? అంటూ సమావేశంలో పాల్గొన్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రశ్నించారు.కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు మున్సిపల్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, నీటి సరఫరా తదితర అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని సమావేశంలో నిర్ణయించారు.ఇది కేవలం కంప్యూటర్ ఆపరేటర్ల సమస్య కాదు, అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్య. నేడు ఒకరి హోదా మారితే, రేపు మరొకరి వేతనం తగ్గవచ్చు. అందుకే అన్ని శాఖల ఉద్యోగులు కలిసి పోరాడాలి అని సమావేశంలో ఉద్యోగులు పేర్కొన్నారు.ముందుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సంప్రదించి వారి సమస్యలను సేకరించాలని, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు. సమస్య పరిష్కారం కాకపోతే శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు.ప్రస్తుతం ఉద్యోగులు పొందుతున్న వేతనం కంటే ఒక్క రూపాయి కూడా తగ్గకుండా వేతన రక్షణ కల్పించాలని, హోదాలు, డిజిగ్నేషన్లు, వేతనాలను ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు.ఒక్కొక్కరిగా పోరాడితే మన గొంతు చిన్నదే, అన్ని శాఖల ఉద్యోగులు ఏకమైతే మన సమస్య రాష్ట్రం మొత్తం వినాల్సిందే అని సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు స్పష్టం చేశారు. పని చేయించుకోవడానికి ఉద్యోగి కావాలి, వేతనం రక్షించడానికి ఎందుకు గుర్తుండడు? అని ప్రశ్నించారు.

# దేవరయాంజాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి**

**శామీర్ పేట్, సెప్టెంబర్ 06 ( ప్రజా వాయిస్ ):**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి సూచించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో కొంపల్లిలోని ఫోకస్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఉమాశంకర్ నేతృత్వంలోని వైద్య బృందం శిబిరానికి హాజరైన వారికి కంటి పరీక్షలు నిర్వహించింది. కంటి సమస్యలు, క్యాటరాక్ట్, డయాబెటిక్ కంటి సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించి, అవసరమైన వారికి తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.... కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవాభావంతో శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ ఉమాశంకర్‌తో పాటు ఫోకస్ ఐ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పేండం లక్ష్మీనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, నాయకులు మిరియాలకార్



సాయి కుమార్, గంధం పాండు గౌడ్, ఫోకస్ ఐ హాస్పిటల్ సిబ్బంది శ్రీరామ్, నందుకిషోర్, మణితేజ, కల్పన్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఆర్‌ఎంపీలు, పీఎంపీల కోదాడ మండల నూతన కమిటీ ఎన్నిక**

**అధ్యక్షుడిగా పాలడుగు నాగరాజు.. ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల లింగయ్య ఏకగ్రీవ ఎన్నిక**

ప్రజా వాయిస్,కోదాడ:
ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం పోరాడుతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కోదాడ పట్టణంలోని వర్తక సంఘ భవన్‌లో ఆదివారం కోదాడ మండల ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నూతన కమిటీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దొంతగాని రవి, జిల్లా ఉపాధ్యక్షుడు భూతం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా పాలడుగు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పాలడుగు నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో సంఘ బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంఘం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమం కోసం సంఘం తరఫున నిరంతరం పోరాడుతామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘంలో ఐక్యతను పెంపొందిస్తూ సభ్యులందరికీ అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల అనంతరం నూతన అధ్యక్షుడు పాలడుగు నాగరాజును సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా



సత్కరించి అభినందించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మలియాల పిచ్చయ్య, జిల్లా క్రమశిక్షణ అధ్యక్షుడు ఎస్పీ వెంకటప్పయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు భుజంగరావు, నూతన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు కందుల శ్రీకాంత్, రెహమాన్, కోశాధికారి రంగా, సహాయ కార్యదర్శి ఎస్కే సలీం, కార్యవర్గ సభ్యులు, ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో వైఫల్యం

**సకల వర్గాల అసంతృప్తి**

**ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాటం**

**బిజెపి శాసనసభ ఉపనేత కాటిపల్లి వెంకట రమణారెడ్డి**

ప్రజావాయిస్ కామారెడ్డి/
ప్రజా సమస్యలను గాలికి వదిలి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ రైతులకు రైతు బీమా ప్రీమియం ఉద్యోగులకు చెప్పిన హామీలు యువతకు నోటిఫికేషన్లు జారీలు అలసత్వం అన్ని వర్గాల ప్రజలను నయవంచనకు గురిచేసిందని శాసనసభ బిజెపి ఉపనేత కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఆదివారం నాడు హైదరాబాద్ బిజెపి శాసనసభ కార్యాలయంలో బిజెపి పక్ష శాసనసభ నేత పాయల్ శంకర్ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఇతర బిజెపి ఏడుగురు ఎమ్మెల్యేలు కలిసి సోమవారం నుంచి జరగనున్న తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలలో ప్రభుత్వాన్ని ఎండగట్టేలా సమీక్ష చేశామని కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని బిజెపి ఉపనేత రమణారెడ్డి చెప్పారు. విద్యార్థులను రైతులను మహిళలను యువత ను అందరిని కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయడంలో కాంగ్రెస్ వైఫల్యం చెందిందన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు ఫీజు రియంబర్స్మెంట్ 11 వేల కోట్ల రూపాయలు బకాయి ఉందని విద్యార్థులు పోరాటం చేస్తున్న చెల్లించడం లేదని కామారెడ్డి ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఏ వర్గం కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి విమర్శించారు. రైతులకు రైతు బీమా ప్రీమియం చెల్లించడం లేకపోవడంతో అకాల మరణం చెందిన రైతులకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం



నిలిచిపోయిందన్నారు. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో యువత పోరుబాట పట్టారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ ప్రక్రియతో బోగస్ ఓట్లు రద్దు చేయబడతాయన్నారు. భూ దోపిడీ కోసమే 22 ఏ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది పేదల రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బిజెపి శాసనసభ ఉపనేత డిమాండ్ చేశారు. ప్రజాధనం ద్యూటీ చేయడంలో టిఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం, కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోటీపడి పనిచేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ కాంగ్రెస్కు తెలంగాణ ఏటీఎంలో మారిందని నెలకు 300 కోట్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్కు పంపిస్తున్నారని మంత్రులు కమిషన్ల కోసం పోట్లాడుకుంటున్నారని మంత్రివర్గంలో సమన్వయం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల మయంగా మారిందని తెలంగాణ బిజెపి శాసనసభ ఉపనేత రమణారెడ్డి ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని రమణారెడ్డి చెప్పారు.

# ముత్యాలమ్మ తల్లి దర్శనం చేసుకున్న బీఆర్ఎస్ నేత పిల్లుట్ల రఘు

**ప్రజా వాయిస్,హుజూర్ నగర్, సెప్టెంబర్, 06**

హుజూర్ నగర్ పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ముత్యాలమ్మ పండుగ ఉత్సవాల్లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లిని పూజించి చీర, సారె, పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించారు.ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ...హుజుర్నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో విలసిల్లాలని, పాడిపంటలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నానన్నారు.ముత్యాలమ్మ జాతరను రాష్ట్ర స్థాయి జాతరగా గుర్తింపు పొందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే మేళ్లచెరువు జాతర ఎద్దుల పందాలు, కబడ్డీ పోటీలతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినట్లుగా,



హుజుర్నగర్ ముత్యాలమ్మ జాతరకు కూడా అదే స్థాయి గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ రెండు రోజులు జాతరకు లక్షల మంది తరలివస్తారని, పోలీసులు శాంతియుతంగా జాతరను నిర్వహించాలని కోరారు.అంతకు ముందు పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి డప్పు కళాకారుల కోలాహలం నడుమ భారీ జనసందోహంతో బీఆర్ఎస్ నాయకులు రఘును గుడి వద్దకు తీసుకొచ్చి ముత్యాలమ్మ తల్లి దర్శనం చేయించారు. తదుపరి పూజారులు, నిర్వాహకులు రఘును సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జగన్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఉద్యమ నాయకులు, న్యాయవాది నగేష్ రాథోడ్, ముల్కపల్లి రాంబాబు, స్థానిక కౌన్సిలర్ నాగరాజు, కౌన్సిలర్ కొలపూడి శ్రీనాద్, కౌన్సిలర్ చిట్టిపోతుల రమేష్, సుభద్ర, శ్రీనివాస్ రాజు, జడ అంజి, లక్క వెంకన్న, గుగులోత్ సందీప్, నరేంద్ర, మండవ నాగేశ్వరావు, కోటేశ్వరి, మేరీగా సాయి, హన్ను, భూక్యా రాముడు, పృథ్వి, శ్రీకాంత్, పంగా శ్రీను, లావుడియా శ్రీను, సాముూల నర్సింహా రెడ్డి, రమేష్ తదితరులు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా దేవగిరి సూర్యప్రకాష్

**ప్రజా వాయిస్/పాలకుర్తి /సెప్టెంబర్ 06**

జనగామ జిల్లా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, వినూత్న బోధనా విధానాలతో విద్యార్థుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటున్న దేవగిరి సూర్యప్రకాష్, సెకండరీ గ్రేడ్ టీచర్, ప్రాథమిక పాఠశాల దర్దేపల్లి ఈ రోజు జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.జిల్లా స్థాయిలో నిర్వహించిన ఘనమైన కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి చేతుల మీదుగా దేవగిరి సూర్యప్రకాష్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడం జరిగింది.సూర్యప్రకాష్ కేవలం పాఠ్యపుస్తక బోధనకే పరిమితం కాకుండా, ఆటపాటలు, వినూత్న కార్యక్రమాలు, ఆకర్షణీయమైన బోధనోపకరణాలు మరియు కార్యాచరణ ఆధారిత బోధన ద్వారా విద్యార్థులకు విద్యను మరింత ఆసక్తికరంగా అందిస్తున్నారు. వందల రకాల స్వీయ తయారీ బోధనోపకరణాలను ఉపయోగిస్తూ పిల్లలలో నేర్చుకోవాలనే ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంపొందిస్తూ ఆదర్శవంతమైన



బోధనను కొనసాగిస్తున్నారు.వారు ఏ పాఠశాలలో పనిచేసినా తమదైన ప్రత్యేకతను చాటుకోవడం వారి విశిష్ట లక్షణం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సేవ చేయడమే తన పరమావధిగా భావిస్తూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటారు. సమాజాన్ని పాఠశాలకు దగ్గర చేసి, మన ఊరు – మన బడి" భావనతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేస్తున్నారు.ఎన్ని అవార్డులు, రివార్డులు, సన్మానాలు అందుకున్నప్పటికీ నిరాడంబరతను వీడకపోవడం సూర్యప్రకాష్ వ్యక్తిత్వానికి నిదర్శనం. విద్యార్థుల అభివృద్ధినే నిజమైన పురస్కారంగా భావిస్తూ, నిరంతరం విద్యారంగ సేవలో ముందుకు సాగుతున్న ఆయనకు ఈ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం దర్దేపల్లి పాఠశాలకు, పాలకుర్తి మండలానికే గర్వకారణం అని తోటి ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.ఈ సందర్భంగా దేవగిరి సూర్యప్రకాష్ ని బంధువులు, ఉపాధ్యాయ మిత్రులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు హృదయపూర్వకంగా అభినందించారు.ఉత్తమ ఉపాధ్యాయుడు పాఠాలు మాత్రమే బోధించడు...విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాడు.ఆ బాటలో అంకితభావంతో సాగుతున్న ఉపాధ్యాయుడే శ్రదేవగిరి సూర్యప్రకాష్.

# కాలుష్యరహిత పటాన్‌చెరు లక్ష్యంగా 3K రన్

## భారీగా పాల్గొన్న విద్యార్థులు యువత మహిళలు

***పటాన్‌చెరు ప్రజావాయిస్***

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "3K రన్ -- పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు సీజన్-2 - రన్ ఫర్ నేచర్" కార్యక్రమం ఆదివారం పటాన్చెరు పట్టణంలో నిర్వహించారు డివిజన్ పరిధిలోని జీూ ఫార్మ్, ORR సర్వీస్ రోడ్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 3ఖ రన్‌ను ప్రారంభించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ ఉద్యోగులు, పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పారిశ్రామిక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది రన్ ఫర్ నేచర్ సందేశంతో సాగిన 3ఖ రన్‌లో పాల్గొన్న వారు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్లకార్డులు, నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.

**పచ్చదనం పెంచుదాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దా పరిశుభ్రమైన పటాన్‌చెరు కోసం ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుదాం వంటి సందేశాలతో కార్యక్రమం సాగింది.పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం, వ్యాయామం, పరిశుభ్రత, పచ్చదనం వంటి అంశాలపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ లు మాట్లాడుతూ పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరులో ఆర్థిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.అభివృద్ధి ఒక్కటే లక్ష్యం కాదు..







ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడమే అసలైన అభివృద్ధి. పటాన్‌చెరు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలి.. అదే సమయంలో పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛమైన గాలి ఉండే ప్రాంతంగా కూడా నిలవాలి అన్నారు.కాలుష్య నియంత్రణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు.పారిశ్రామిక మరియు వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణను తన వ్యక్తిగత బాధ్యతగా భావించాలి. ఒక మొక్క నాటడం, దాన్ని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్న చిన్న చర్యలే భవిష్యత్ తరాలకు పెద్ద మార్పును తీసుకువస్తాయి అని వారు పేర్కొన్నారు.కాలుష్యరహిత పటాన్‌చెరు అనేది ఒక్కరి లక్ష్యం కాదు.. మనందరి సమిష్టి సంకల్పం. ఈ సంకల్పాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిరంతర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**మొక్కల పంపిణీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతీక**

కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అందజేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలను పంపిణీ చేశారు.మొక్కలు నాటడం ప్రారంభం మాత్రమే దాన్ని పెంచి సంరక్షించడమే అసలైన బాధ్యత అనే సందేశంతో ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.3ఖ రన్ ద్వారా ఒకవైపు ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, మరోవైపు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో బాధ్యతను పెంపొందించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది.పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉత్సాహంగా రన్‌లో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది.యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం, మహిళలు మరియు విద్యార్థులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొనడం పర్యావరణ సందేశం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా నిలిచింది.ఆరోగ్యం, పర్యావరణం రెండింటినీ కలిపి నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో సానుకూల స్పందనను తీసుకువచ్చింది.ఈ కార్యక్రమానికి మెడికల్ పార్ట్‌నర్‌గా సహకరించి, 3ఖ రన్‌లో పాల్గొన్న వారి ఆరోగ్య భద్రతకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించిన అమెదా హాస్పిటల్స్ యాజమాన్యానికి, వైద్యులు మరియు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అమెదా హాస్పిటల్స్ అందించిన సహకారం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రోత్సహించిన ప్రజాప్రతినిధులకు, సహకరించిన అధికారులు మరియు పోలీసు శాఖకు, పరిశ్రమల ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలకు, వాలంటీర్లకు, నిర్వాహక బృందానికి, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న ఉత్పత్తులతో స్వయం ఉపాధికి అవకాశాలు

## యువత ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

మిల్లెట్ ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతోపాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.ఆదివారం హనుమకొండ గోపాల్ పూర్ జవహర్ కాలనీలో ఐఐఎంఆర్ న్యూట్రి హబ్ ప్రోత్సాహంతో ఉజ్వల చంద్రగిరి అనే యువతి ఎంటర్ప్రెన్యూషిప్ లో భాగంగా నెలకొల్పిన అరిస్టా గ్రోత్ ఫార్మ్ మిల్లెట్ పన్నీరు మాన్యూప్యాక్చరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఉత్పత్తి యూనిట్ కు సంబంధించిన వివరాలను ఎంటర్ప్రెన్యూరర్ ఉజ్వలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలో దేశంలోనే తొలిసారిగా ప్లాంట్ బేస్డ్ మిల్లెట్ పన్నీర్ తయారీ యూనిట్ ఇది అని, ఈ యూనిట్‌లో పాల ఉత్పత్తులతో కాకుండా మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను ఉపయోగించి నాన్-డెయిరీ మిల్లెట్ పన్నీర్, మిల్లెట్ బాసుంది తయారు చేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తుల తయారీకి ఈ యూనిట్ దోహదపడుతుందన్నారు.ఈ పరిశ్రమ ఏర్పాటుకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (××వీ=) ఆర్కేవీవై రాఫ్తార్ కార్యక్రమం ద్వారా స్థాపించినట్లు పరిశ్రమ నిర్వాహకురాలు ఉజ్వల కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఐఐఎంఆర్ వంటి సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమలకు ప్రస్తుతం విస్తృతమైన డిమాండ్ ఉందని, నిరుద్యోగ యువత కొత్త పరిశ్రమల ఏర్పాటుతో స్వయం ఉపాధి సాధించాలని తెలిపారు.మిల్లెట్ ఉత్పత్తుల తయారీ రంగంలో మహిళలు, యువతకు స్వయం ఉపాధి, స్వయం ఆర్థిక సాధికారతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ న్యూట్రి హబ్ కు చెందిన డాక్టర్ జె.స్టాన్లే , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, న్యూట్రిహబ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.



# బీసు చందర్ గౌడ్ కు 'ఉత్తమ సేవ' అవార్డు

**ప్రజా వాయిస్/ ఆత్మకూర్ (ఎం):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ కు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో మాతృదేవోభవ సత్వంగ్ ,సావిత్రి బాయ్ ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చందర్ గౌడ్ ఆత్మకూర్(ఎం) పట్టణానికి చేసిన సేవ కార్యక్రమాలు గుర్తించి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉత్తమ సేవ అవార్డును అందజేశారు.





# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం గర్వకారణం

**ప్రజా వాయిస్,మోత్కూరు(సెప్టెంబర్6):**

యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు లు రావడం మోత్కూరు ప్రాంతానికి గర్వకారణమని మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్, బిఆర్ఎస్ నాయకులు మద్రి అనిల్ అన్నారు. అవార్డులు అందుకున్న అందుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోత్కూర్, పాటిమట్ల ఉపాధ్యాయులు ఇండ్ల రాంప్రసాద్,దర్శనం వెంకన్న, కంచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కూరెళ్ల యాకస్వామి లకు మండల కేంద్రంలో ఆదివారం శుభాకాంక్షలు తెలియచేస్తూ పూలదండలు శా లువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, కూరెళ్ల పరమేష్, ఉపాధ్యాయులు మందుల కృష్ణయ్య,కూరెళ్ల రవి, దళిత నాయకులు కూరెళ్ల రమేష్, చుక్క అశోక్, కొంపెల్లి మల్లెష్, కూరెళ్ల శ్రీశైలం, కూరెళ్ల నర్సింహా, చెడిపెల్లి ఆనంద్ మరియు కందుకూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# బోనాల వేడుకల్లో పాల్గొన్న : కీసర సంతోష్ రెడ్డి

**మోతె సెప్టెంబర్ / ప్రజా వాయిస్**

ఆదివారం మోతె మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పాల్గొని భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు, గ్రామ శాఖ అధ్యక్షులు కోట మధుసూదన్ రెడ్డి, తండు సంజీవ, గోపి కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అధ్యాపక రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ దుండిగలా అశోక్

**ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం సెప్టెంబర్ 6**

కొండమల్లేపల్లి పట్టణం శ్రీకాంత్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ హరి యూనివర్సిటీ కన్వ శాంతి వనం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో కళాశాల నుండి 900 మంది ఉపాధ్యాయ అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న వారు నుంచి దరఖాస్తులు స్వీకరించగా 232 మందిని ఎంపిక చేయగా వారిలో దుండిగల్ అశోక్ 79 వ స్థానంలో నిలిచారు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు





# అంబేద్కర్ పై అనుచిత పుస్తకం రాస్తే సహించం

**- కల్పిత ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి**

**- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వన తడుపుల అంజయ్య**

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారిని కించపరిచేలా 'కల్పిత నాయకుడు' అనే పుస్తకాన్ని రచించిన కల్పిత ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి వన తడుపుల అంజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కోరుట్లలో నిర్వహించిన దళిత సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయశక్తుల ప్రేరేపణతో అంబేద్కర్ వంటి మహనీయునిపై ఇలాంటి పుస్తకాలు రాయడం దళితుల సహనాన్ని పరీక్షించడమేనని మండిపడ్డారు. ఈ నెల 8 నుండి 14 మధ్య తలపెట్టిన పుస్తక విడుదలను వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సిహెచ్ నరసయ్య, సత్యనారాయణ, నాయకులు రాజనర్సయ్య, చిన్న మెట్పల్లి ముత్తయ్య, యూసుఫ్ నగర్ రాజు, కళ్యాణ్, సుధీర్, ఐలాపూర్ విజయ్, కార్తీక్, హరీష్, బాబురావు, సర్పంచ్ పూర్ లింగమూర్తి, న్యాయమూర్తి తొగారి మోహన్, మాదాపూర్ ఎం. గంగ నరసయ్య మరియు అంబేద్కర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.





# పాల్వాయిలో ఘనంగా బోనాల పండుగ

**బోనాలతో కదిలిన మహిళలు.. భక్తులతో కిక్కిరిసిన ఆలయం.**

**అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు**

**ప్రజా వాయిస్,గుర్రంపోడు.**
నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలోని పాల్వాయి గ్రామంలో బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులుచెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.బోనాల ఊరేగింపుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల సందడితో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. పండుగను విజయవంతం చేసేందుకు గ్రామస్థులు సహకరించారు. సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలులో విఫలం: బీఆర్ఎస్ నిరసన

**ఆరు గ్యారెంటీలు.. 420 హామీలపై ఎండగట్టే కార్యక్రమం.**

**ప్రజా వాయిస్/పాలకుర్తి**
**సెప్టెంబర్ 06**
జనగామ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు పాలకుర్తి మండల కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టారు.



**హరిత కాకతీయ స్థలం, మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ఆందోళన**
పాలకుర్తి మండల కేంద్రంలోని హరిత కాకతీయ హోటల్ మంజూరైన స్థలం, మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ, వాటి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు**
ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జిల్లా నాయకులు బానోత్ మహేందర్ నాయక్, సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న, మండల ప్రధాన కార్యదర్శి పాము శ్రీను, ఉప సర్పంచ్ గాదేపాక కిరణ్, వార్డు సభ్యుడు కమ్మగాని సుధాకర్, మండల నాయకులు కడుదుల కర్ణాకర్‌రెడ్డి, కమ్మగాని సారయ్య, పసుల వెంకట్, పందిబోయిన శ్రవణ్, నారాయణ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చి మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆటో కార్మికులకు వెంటనే రూ.36 వేల బకాయిలు చెల్లించాలి**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఆటో కార్మికులతో భారీ ర్యాలీ**

**పటాన్ చెరువు ప్రజావాయిస్**
అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటలను మరిచి ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బిహెచ్ఇఎల్ నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు ఆటో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులను ఉద్దేశించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని. హామీలను అమలు చేయాలని అడిగితే సాకులు చెప్పడం తప్ప, ప్రజలకు ఇచ్చిన మాటను



నిలబెట్టుకునే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు అని మండిపడ్డారు.ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క రూపాయి కూడా సక్రమంగా అందించలేదని విమర్శించారు. మూడు సంవత్సరాలకు ఒక్కో ఆటో కార్మికుడికి రూ.36,000 బకాయి పడిన ప్రభుత్వం.. ఆ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయ్యాయి కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం ఇంకా ఫైళ్లలోనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రచారం చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు వంచనల ప్రభుత్వంగా మారింది" అని మహిపాల్ రెడ్డి ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, ఆటో సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

**ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి**

**1000 రోజుల ప్రజాపాలనకు కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ**

**పటాన్ చెరు ప్రజావాయిస్**
ప్రజా సంక్షేమ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగుతోందని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి అన్నారు ఆదివారం పటాన్చెరు పట్టణ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు కొల్కురి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పటాన్ చేరు పట్టణ ఎంజీ రోడ్డు గాంధీ పార్క్ నుండి జాతీయ రహదారి అంబేద్కర్ సర్కిల్ వరకు 1000 రోజుల ప్రజాపాలన విజయం పై వికాస పెద్ద ఎత్తున పాదయాత్ర కేక్ కటింగ్ బాణసంచా పేల్చి విజయోత్సవం నిర్వహించామని అన్నారు కొల్కురి నర్సింహ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనలో 22 లక్షల రైతులకు 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ మహిళలకు ఉచిత రవాణా 500 లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ గృహ జ్యోతి 200 ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇళ్లు వడ్డీలేని డ్వాక్రా రుణాలు నిరుద్యోగ యువత కొరకు 70 వేల ఉద్యోగ నియామకాలు కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు కోటి మందికి రేషన్ ద్వారా సన్న బియ్యం విద్య కొరకు ప్రతి నియోజక వర్గానికి 200 కోట్లతో ఇశీటిగ్రేటెడ్ పాఠశాలలు పంటకు 12 వేల రైతు భరోసా వరి క్వింటాలుకు 500 బోనస్ సాగు కొరకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇలా ఇంకా ఎన్నో అనేక పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్ పట్టణ కాంగ్రెస్ నాయకులు రవి ముదిరాజ్ సాయిలు ముదిరాజ్ యువరాజ్ సిద్దు శ్రీనివాస్ రాము ఐఎన్టీయూసీ నాయకులు రతన్ సింగ్ అంజయ్య మల్లేష్ యువజన కాంగ్రెస్ అక్షిత్ హనుమంతు మహేష్ మహిళా కాంగ్రెస్ జ్యోతి కల్పన ప్రభావతి రాణి సంధ్య రమ తదితరులు పాల్గొన్నారు



# చర్చిలో అర్ధరాత్రి విధ్వంసం 22 మందిపై ఫిర్యాదు.!

**సీసీ కెమెరాలు ధ్వంసం కార్యాలయ తలుపులు, ఫర్నిచర్ పగులగొట్టినట్లు ఆరోపణలు**

**రాజకీయ,ఆర్థిక అండతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా.?**

**చర్చి ప్రతినిధులు**

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**
పవిత్ర ప్రార్థనా స్థలంలోకి అనుమతి లేకుండా చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారన్న ఆరోపణలు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపుతున్నాయి. ఖానాపూర్‌లోని బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో సీసీ కెమెరాలు,కార్యాలయ తలుపులు,ఫర్నిచర్‌తో పాటు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారంటూ చర్చి కమిటీ ప్రతినిధులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.చర్చి ప్రతినిధుల ఫిర్యాదు ప్రకారం..సెప్టెంబర్ 5న మధ్యాహ్నం రామేశ్వరం నర్సింహాతో పాటు మరికొందరు చర్చి ప్రాంగణంలోకి అనుమతి లేకుండా ప్రవేశించి సొసైటీకి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న చర్చి ప్రతినిధులు వాటిని తొలగించినట్లు పేర్కొన్నారు.అదే రోజు రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో రామేశ్వరం నర్సింహాతో పాటు మొత్తం 22 మంది మళ్లీ చర్చి ప్రాంగణంలోకి వచ్చినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ సమయంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ కార్యాలయ తలుపులు పగులగొట్టి,లోపల ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.చర్చి ప్రాంగణంలోని శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారని ఆరోపించారు.

**అడ్డుకున్నవారికి బెదిరింపులా?**
విధ్వంసాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన చర్చి ప్రతినిధులను బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చర్చి ఆస్తులతో పాటు తమకు రక్షణ కల్పించాలని,ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

**భూమి వివాదమే కారణమా?**
చర్చి భూమి ఖానాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 220లో 26 గుంటల విస్తీర్ణంలో ఉందని కమిటీ పేర్కొంది.ఈ భూమిని 1991లో రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపింది.భూమికి సంబంధించిన వివాదం ఉంటే పత్రాలను పరిశీలించి చట్టపరంగా పరిష్కరించుకోవాల్సిందే తప్ప,చర్చి ప్రాంగణంలోకి చొరబడి ఆస్తులను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.







**పలుకుబడి ఉంటే చట్టం చేతుల్లోకి తీసుకుంటారా?**
రాజకీయ,ఆర్థిక బలం ఉందనే ధైర్యంతో ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవచ్చా.? అంటూ చర్చి ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇది కేవలం ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన అంశం కాదని,ప్రార్థనా స్థల పవిత్రతకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి,నిజానిజాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.

# పల్లె చెరువులో పగ చిచ్చు కత్తులతో హత్య.!

**గంజాయి వ్యవహారమే అసలు కారణమా?**

**హత్య తర్వాత కత్తులు, దుస్తులు కాల్చి ఆధారాల మాయం**

**మీడియాకు వివరాలను వెల్లడించిన డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్**

**ప్రజావాయిస్/ రాజేంద్రనగర్:**
పాతకక్షలకు గంజాయి విక్రయాల వివాదం తోడై ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్నట్లు డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్ వెల్లడించారు.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లె చెరువు సమీపంలో ఈ నెల 2న జరిగిన మొహమ్మద్ ఖాజీ సోహైల్ హత్య కేసును పోలీసులు ఛేదించి ముగ్గురిని అరెస్టు చేశారు.మీడియా సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్ మాట్లాడుతూ..సెప్టెంబర్ 01 రాత్రి సోహైల్‌తో కలిసి నిందితులు మద్యం సేవించారు.అనంతరం తెల్లవారుజామున అబ్దుల్ రహీమ్,మహమ్మద్ ఇషాక్‌లు అతడిని ద్విచక్రవాహనంపై పల్లె చెరువు వైపు తీసుకెళ్లారు. అబ్దుల్ కరీం ట్రేడర్స్ సమీపంలో కత్తులతో దాడి చేయడంతో సోహైల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.హత్య అనంతరం ప్రధాన నిందితుడు సయ్యద్ అర్షద్ అలియాస్ అల్తమాష్ చాకు అలియాస్ బడా ముజ్రిమ్‌కు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు.మృతుడు చనిపోయాడా లేదా నిర్ధారించుకోవడంతో పాటు కత్తులను తీసుకురావాలని అతడు సూచించినట్లు తెలిపారు.

**ఆధారాలు కాల్చేసినా – పోలీసుల చేతికి చిక్కిన కత్తులు**
హత్యకు ఉపయోగించిన కత్తులు,ఘటన సమయంలో ధరించిన దుస్తులను వినాయక్‌నగర్ కల్లు కాంపౌండ్ సమీపంలోని చెత్తకుప్ప వద్దకు తీసుకెళ్లి కాల్చివేసినట్లు పోలీసులు తెలిపారు.అయితే నిందితులు చూపించిన ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి మూడు కత్తులు,మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు సయ్యద్ అర్షద్‌పై గతంలో 13 కేసులు,అబ్దుల్ రహీమ్‌పై రెండు కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పాతకక్షలు,గంజాయి వ్యవహారమే హత్యకు అసలు కారణమా.? మరెవరైనా ఈ హత్యలో భాగస్వాములా.? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# ఆపదలో అండగా వివేకానంద పొదుపు సంఘం

**ఇటీవల మృతి చెందిన మలగల్ల సతీష్ కుటుంబానికి**

**రూ. 1,20,000 బీమా**

**బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చిన సంఘం అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్**

(ప్రజా వాయిస్ షాబాద్)
ఇటీవల మరణం చెందిన షాబాద్ నివాసి మలగల్ల సతీష్ కుటుంబానికి షాబాద్‌లోని వివేకానంద పొదుపు సంఘం కొండంత అండగా నిలిచింది. మృతుడు సతీష్ వివేకానంద పొదుపు సంఘంలో సభ్యుడిగా ఉన్నందున, సంఘం నిబంధనల ప్రకారం ఆయన కుటుంబానికి వర్తించే రూ. 1,20,000 లక్షా ఇరవై వేల రూపాయల బీమా సాయాన్ని సంఘం ప్రతినిధులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆత్మీయంగా అందజేశారు ఈ సందర్భంగా వివేకానంద పొదుపు సంఘం అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. సతీష్ అకాల మరణం పొదుపు సంఘం సభ్యులందరికీ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. సంపాదించే వ్యక్తిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి ఈ ఆర్థిక సాయం కొంతైనా ఊరటనిస్తుందని భావిస్తున్నామని తెలిపారు. సంఘంలో ప్రతి సభ్యుడి సంక్షేమం తమకు ముఖ్యమని సతీష్ కుటుంబానికి భవిష్యత్తులో కూడా ఏ అవసరం వచ్చినా సంఘం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు ఈ సహాయ కార్యక్రమం లో వివేకానంద పొదుపు సంఘం అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్‌తో పాటు పాలకమండలి సభ్యులు గౌరీశ్వర్, రజనీకాంత్, మల్లికార్జున్, గౌతమ్, జగదీష్, రవీందర్ గౌడ్ మరియు స్థానికులు పాల్గొన్నారు.



# కొమురం భీం ప్రాజెక్ట్ కుడి కాలువ కుంగిపోయినా పట్టించుకోని అధికారులు

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మాణిగూడ గ్రామపంచాయతీ వద్ద కొమరం భీం ప్రాజెక్ట్ కుడి కాలువ ఇటీవలి వర్షాలకు కుంగిపోయింది. కాలువ అభివృద్ధి పనుల కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక బడ్జెట్ నుంచి రూ.42 లక్షలు కేటాయించి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పనులు నాసిరకంగా జరగడంతో కాలువ పొంగి సీసీ రోడ్డు కొట్టుకుపోయిందని గ్రామస్తుల ఆరోపణ. కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయం, పాఠశాల భవనం, ఇళ్ల వరకు కాలువ నీరు చేరడంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకొంది. ఇన్‌చార్జి మంత్రి గ్రామాన్ని సందర్శించకపోవడంపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.వెంటనే పనులు పూర్తి చేయాలని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. స్పందన లేకపోతే గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్, ఎమ్మెల్యే, మంత్రి నివాసాలను ముట్టడిస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్ హెచ్చరిక జారీ చేశారు.

# చింతలమానేపల్లి మండలంలో గంజాయి సాగుపై పోలీసుల దాడి

**9 మొక్కలు స్వాధీనం**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**




కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో పోలీసులు గంజాయి సాగుపై దాడి నిర్వహించారు. నమ్మకమైన సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో కుంబారి శంకర్ (తండ్రి రాములు, వయస్సు 68) తన పెరటి స్థలంలో అక్రమంగా సాగు చేస్తున్న 9 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.60,000. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు, దర్యాప్తు కొనసాగుతోంది.గంజాయి సాగు, విక్రయం, రవాణా, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సంతోష్ కుమార్ తెలిపారు. ఈ దాడిలో కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్, చింతలమానేపల్లి సబ్-ఇన్స్పెక్టర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెయ్యి రోజులుగా అసెంబ్లీకి దూరం!

**- కేసీఆర్‌కు పదవిపై మమకారం ఎందుకు?**

**- కేసీఆర్ రాజీనామా చేయాలి:డీసీసీ ఉపాధ్యక్షులు సుభాష్ గౌడ్**



**ప్రజావాయిస్ / మోమిన్ పేట్:**
మాజీ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని వికారాబాద్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సుభాష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో మోమిన్ పేట్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుభాష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా, మాజీ సీఎం కేసీఆర్ మాత్రం వెయ్యి రోజులుగా అసెంబ్లీకి హాజరుకాకుండా జీతం తీసుకుంటూ, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను విస్మరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందించలేని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కౌటాలలో బిఆర్ఎస్ మీడియా సమావేశం

**ఎం ఎల్ సి దండే విఠల్ వ్యాఖ్యలపై ఆగ్రహం**



**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గ నాయకులు కోనప్ప, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లపై ఎం ఎల్ సి దండే విఠల్ ఇటీవల చేసిన వ్యక్తిగత దూషణలను, "నాలుక కోస్తా" వ్యాఖ్యలను బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు సభ్య సమాజం హర్షించదగ్గవి కావని మండిపడ్డారు.బిఆర్ఎస్ పార్టీ దండే విఠల్‌ను నిలదీస్తూ, ఆయనను ఎం ఎల్ సిగా చేసింది బిఆర్ఎస్ పార్టీయేనని, పార్టీ వల్ల పదవి పొంది ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన ఎంతకు అమ్ముడుపోయారో చెప్పాలని ప్రశ్నించింది. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌ను "పాస్‌పోర్ట్ నాయకుడు" అని, అమ్ముడుపోయారని వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొంది. మరో నాలుగు రోజుల్లో కాంగ్రెస్ దుకాణం మూతపడటం ఖాయమని, ఆ పార్టీ వద్ద ఉన్న సర్పంచ్‌లు కూడా త్వరలో ప్రవీణ్ కుమార్ వద్దకు క్యూ కడతారని పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కవని బిఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యానించారు.ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ అమ్మవార్లకు ఎమ్మెల్యే పద్మావతి పూజలు

**నారాయణపురం, పాలేఅన్నారంలో ఘన స్వాగతం..**

**ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష**



**ప్రజా వాయిస్,చిలుకూరు:**
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని పాలే అన్నారం గ్రామంలో కొలువైన శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ, నారాయణపురం ముత్యాలమ్మ అమ్మవార్లను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే.. గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే పద్మావతిని శాలువాతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌కుమార్, తమ్మనబోయి శంకర్, దేశబోయిన నరసింహారావు, పదిర వీరబాబు, బూర వెంకన్న, మామిడి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జంగా వెంకటయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

**విద్యుత్ షాక్‌తో గాయపడిన వెంకటయ్యకు పరామర్శ**

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**
మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం మాజీ ఉపసర్పంచ్ జంగా వెంకటయ్యను మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆదివారం పరామర్శించారు. వ్యవసాయ పనుల్లో భాగంగా మోటార్ మరమ్మతులు చేస్తుండగా వెంకటయ్య విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న భాస్కర్ రావు గ్రామానికి చేరుకుని వెంకటయ్యను ప్రత్యేకంగా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు దాములూరు రంగారావు, రవీందర్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తుమ్మల ఫణికుమార్, సీనియర్ జర్నలిస్ట్ జంగా లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి పరామర్శ

**ఆర్థిక సహాయం అందించిన**

**ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజా వాయిస్/రాయపర్తి**
సేవే పరమో ధర్మం అనే లక్ష్యంతో బాధిత కుటుంబలకు అండగా నిలుస్తున్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామం నాను తండ గ్రామానికి చెందిన బానోత్ శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదం లో గాయపడి హన్మకొండ రోహిణి హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటుండగా వారిని హాస్పిటల్ లో పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్'తరపున 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన..ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమం లో రాయపర్తి మండల నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రాము, సర్పంచ్ ఇస్లావత్ సంతోష్, బొమ్మేనేని సురేందర్ రెడ్డి, సింగారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...



# ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీ సమావేశం

**ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యచరణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు..**

**అసమానతలను లేని సమాజాన్ని నిర్మిద్దాం..**

**ఎమ్మార్పీఎస్ నాయకుడు అబ్రహం మాదిగ..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పార్టీ బలోపేత నిర్మాణంలో భాగంగా ఆదివారం నాడు జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక సమావేశం ఎన్ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సారథ్యంలో అన్ని విభాగాల స్థంసాగతల గురించి సమాజంలో ఎలాంటి వివక్షత లేకుండా అన్ని సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి వ్యక్తులను ఉద్యమ శక్తులుగా మలచాల్సిన అవసరం ఉందని ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాలు అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఆయా మండలాల నాయకులు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం...

**- బాకీ కార్డులతో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం.**

**- రేవంత్‌రెడ్డి హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ బాకీ కార్డుల పంపిణీ**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎలిగేడు మండలంలోని ఎలిగేడు, నర్సాపూర్, నారాయణ పల్లి, ర్యాకల్దేవ్ పల్లి,లాలపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎలిగేడు మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు ఆధ్వర్యంలో 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మి దుర్గయ్య, కవ్వంపల్లి సాయినాథ్, తిరుపతి రెడ్డి లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ హామీల అమలుపై కోనప్ప ఆగ్రహం

### బాకీ కార్డుల పంపిణీ

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం బారేగూడ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్ నాయకులతో కలిసి 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు.మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, రైతు భరోసా, రైతులకు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, హామీల అమలుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. హామీల అమలు జరిగే వరకు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీ సాహిత్యవేత్త డాక్టర్ మనోహర్‌కు ఘన సన్మానం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
ఆసిఫాబాద్‌లో ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివాసీ సాహిత్యవేత్త, రిటైర్డ్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మనోహర్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివాసీ పర్ధాన్‌ల జీవన విధానం, సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో డాక్టర్ మనోహర్ చేసిన కృషిని వక్తలు అభినందించారు.తెలుగు అకాడమీ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు పాఠ్యపుస్తకంలో "ఆదివాసీ పర్ధాన్‌ల జీవిత విశేషాలు" పాఠ్యాంశాన్ని డాక్టర్ మనోహర్ రచించడం ఆదివాసీ పర్ధాన్ సమాజానికి గర్వకారణమని తెలిపారు. ఈ పాఠ్యాంశం ద్వారా ఆదివాసీ పర్ధాన్‌ల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సామాజిక నేపథ్యం రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులకు పరిచయం అయ్యే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజం ప్రముఖులు పుర్కా ఉద్ధవ్, గేడం జనార్దన్, ప్రేమ్, పెంటయ్య, ఏఎంసీ డైరెక్టర్ రాంచందర్, తిరుపతి, కుర్సేగా శంకర్, కౌన్సిలర్ బాలకృష్ణన్, కొర్వేత మనోహర్, డిఎంహెచ్ఓ నాగేంద్ర, కృష్ణమూర్తి, ఎం. గోపాల్, సర్పంచులు చందు, వందన, శేషు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న 'ఖేలో ఇండియా' ఖో-ఖో ఎంపిక పోటీలు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో-ఖో జట్లకు ఎంపికలు**

**ఖో-ఖో క్రీడాకారులకు 'ఖేలో ఇండియా'లో సత్తా చాటే అవకాశం**

**సరూర్‌నగర్‌లో ఖో-ఖో ఎంపిక పోటీలు**

**రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక**



**శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :**
రాష్ట్ర స్థాయి 'ఖేలో ఇండియా' ఖో-ఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట జై ప్రకాష్ తెలిపారు.ఈ సందర్భంగా బాలురు, బాలికల విభాగాల్లో 12 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి 1వ తేదీన లేదా ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలి.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, మైనారిటీ సంక్షేమ విద్యాసంస్థలు, స్పోర్ట్స్ క్లబ్‌లకు చెందిన అర్హులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యాసంస్థ ఐడీ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు నిర్ణీత సమయానికి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం రంగారెడ్డి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్‌ను 9010535958 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



### కామారెడ్డి జిల్లాలో రోడ్లను

## శుభ్రం చేసిన గంప గోవర్ధన్

**కాంగ్రెస్ సర్కార్ పై బీఆర్ఎస్ పోరుబాట**

**ప్రజా వాయిస్ భిక్కనూర్/**
కాంగ్రెస్ సర్కారుపై బిఆర్ఎస్ పోరు బాటలో భాగంగా ఆదివారం నా డు భిక్కనూరు మండలం జంగంపల్లిలో గులాబీ శ్రేణులు రోడ్లను శుభ్రం చేశారు.కాంగ్రెస్ సర్కార్ అన్ని రంగాలలో విస్వరమైందని పారిశుద్ధ్యం నిర్వహించడం దారుణంగా విఫలమైందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను ఎత్తిచూపుతూ కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పాల్గొన్నారు.గ్రామంలోని రోడ్లను స్వయంగా గంప గోవర్ధన్ , ముజీబొద్దీన్ స్వయంగా శు భ్రం చేస్తూ చెత్తను తొలగిస్తూ కాంగ్రెస్ పాలనలో పడకేసిన పారిశుద్ధ్య వ్యవస్థను ప్రజల దృష్టికి తీసుకువచ్చారు.బీఆర్ఎస్ హయాంలో 'పల్లె ప్రగతి'తో గ్రామాల్లో పారిశుద్ధ్యానికి, అభివృద్ధికి పెద్దపీట వేశామని, ప్రస్తుతం గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కూడా కరువయ్యాయని గంప గోవర్ధన్ విమర్శించారు.




## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ

**- పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కమిటీ కృషి**

**- జిల్లాల వారీగా కార్యాచరణ, అవగాహన కార్యక్రమాలు**

**- అధికారుల నిర్లక్ష్యం, అవినీతిపై చర్చ**

**- జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్**

**ప్రజా వాయిస్ హైదరాబాద్ :**
సమాచార హక్కు చట్టం సాధన కమిటీని ప్రతి జిల్లాలో బలోపేతం చేస్తామని జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. ఆదివారం బి.యన్ రెడ్డి లోని ద్వారకా కన్వెన్షన్ లో హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి అధ్యక్షత వహించారు. సంస్థ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, జిల్లాల వారీగా ప్రజా సమస్యలపై కార్యాచరణ, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వివిధ జిల్లాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలపై చర్చ జరిగింది. సమస్యలకు సంబంధించిన ఆధారాలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, చట్టపరమైన మార్గాలను అనుసరించాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలో కమిటీ కార్యకలాపాలను విస్తరించి, బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమిష్టిగా పనిచేయాలని సమావేశం పిలుపునిచ్చింది. అనంతరం సమావేశాన్ని విజయవంతం చేసిన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులు, సభ్యులందరికీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోలా, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, వంగల వివేకానందు, రాష్ట్ర కార్యదర్శి రావుల నవీన్ కుమార్, వేణు గోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, అశోక్ కుమార్, కాశి సతీష్ కుమార్, గడప కృష్ణ, అరవింద స్వామి, కార్తీక్ రెడ్డి, బాపయ్య, విజయ్ రామ్ సింగ్, వంశీ కృష్ణ, రఘు, రమేష్, 33 జిల్లాల ఆర్టీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత కారణాలతో

## యువకుడి ఆత్మహత్య

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**



కుటుంబ తగాదాలతో యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండల కేంద్రమైన పుల్కల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలం (38) వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగించేదని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి ఇంట్లో గొడవలు జరగడంతో ఆదివారం ఉదయం పంటపొలం చూసి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని ఓ వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలుపగా. వెంటనే అక్కడికి వెళ్లి చూసే సరికి మృతి చెంది ఉన్నట్లు గుర్తించి మృతదేహాన్ని చెట్టు నుంచి విడిచి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మృతిని తల్లిదండ్రులు ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు శ్రీశైలం కూతురు వివాహం చేశారు. ప్రస్తుతం భార్య కొడుకు మాత్రమే ఉన్నారు.




## ఎనుమాముల ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం (జుఎవీ) గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాంలో అమలులో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.తనిఖీ లో డియార్వో విజయలక్ష్మి,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్కూల్కి వెళ్తున్నానని చెప్పిన ఓ విద్యార్థి అదృశం

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**



పాఠశాలకు వెళ్తాను అని చెప్పి విద్యార్థి అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో చోటుచేసుకుంది . పట్టణ సీఐ రామనాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. వట్పల్లి మండలం కదిరాబాద్ గ్రామానికి చెందిన గొల్ల కిషన్ కి ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు అయిన గొల్ల లక్ష్మణ్ (13) సంగారెడ్డి పట్టణంలోని బాయ్స్ స్కూల్లో 95 తరగతి చదువుతున్నాడు. ఈ నెల 5న ఉదయం తన స్వగ్రామం నుంచి స్కూలుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అప్పటి నుంచి నేటి వరకు అతడి ఆచూకీ తెలిసి రాలేదు. విద్యార్థి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 08455-276333 లేదా 87126 56718 నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సీఐ సూచించారు.

# తెరపై సామాజిక పోరాటం... నిజ జీవితంలో సామాజిక బాధ్యత ఎక్కడ?


జిలుకరా రామ్మూర్తి

మన సమాజంలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. విద్య, వైద్యం, నిరుద్యోగం, యువత భవిష్యత్తు, సామాజిక అసమానతలు వంటి సమస్యలపై నిజ జీవితంలో పోరాడే సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, కేసులు, అరెస్టులు ఎ కొన్నిసార్లు ప్రాణాలకే ప్రమాదం.అదే సమయంలో, ఈ సమస్యలనే కథాంశాలుగా తీసుకుని సినిమాలు నిర్మించినప్పుడు, వాటి ద్వారా భారీ వాణిజ్య లాభాలు ఆర్జించే పరిస్థితి ఉంది.

**ఇక్కడ ప్రశ్న సినిమా తీయడం తప్పా? కాదు**

సినిమా సమాజాన్ని ప్రశ్నించగలదు. ప్రజల్లో చైతన్యం తీసుకురాగలదు. ఒక మంచి సినిమా వేలాది మందిని ఆలోచింపజేయగలదు. అందుకే కళాకారుల పాత్రను తక్కువ చేయడం కాదు.
కానీ ప్రశ్న ఒక్కటేతెరపై చూపించే సామాజిక బాధ్యతకు, నిజ జీవితంలోని సామాజిక బాధ్యతకు మధ్య ఇంత అంతరం ఎందుకు?
సినిమాలో హీరో... సమాజంలో ప్రేక్షకుడా?
ఒక సినిమాలో హీరో పేద విద్యార్థి కోసం పోరాడతాడు.
మరో సినిమాలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను ప్రశ్నిస్తాడు.
ఇంకో సినిమాలో యువత నిరుద్యోగ సమస్యపై గళమెత్తుతాడు.
ప్రేక్షకులు చప్పట్లు కొడతారు.
కానీ అదే సమస్యలు నిజ జీవితంలో ఎదురైనప్పుడు
ఆ హీరోలలో ఎంతమంది బాధితుల పక్కన నిలబడతారు?
ఎంతమంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు?

**ఎంతమంది విద్య కోసం ఉద్యమిస్తారు?**

ఎంతమంది ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని మెరుగుపరచాలని నిరంతరం ఉద్యమిస్తారు?
ఎంతమంది నిరుద్యోగ యువతతో కలిసి రోడ్డుపైకి వస్తారు?
ఇవి వ్యక్తిగతంగా ఏ హీరోను నిందించడానికి వేసే ప్రశ్నలు కావు. ప్రజాదరణ, సంపద, ప్రభావం పొందిన ప్రతి ప్రముఖ వ్యక్తికి ఉండాల్సిన సామాజిక బాధ్యతపై వేసే ప్రశ్నలు.
ఎందుకంటే ఒక సాధారణ వ్యక్తి చెప్పిన మాట వంద మందికి వినిపించవచ్చు.
కానీ ఒక స్టార్ చెప్పిన మాట లక్షల మందికి చేరుతుంది.
అంతటి ప్రభావం ఉన్నప్పుడు బాధ్యత కూడా అంతే పెద్దదిగా ఉండాలి.
సినిమా వ్యాపారం కావచ్చు... కానీ ప్రజల సమస్యలు కేవలం వ్యాపార వస్తువులా?
సినిమా పరిశ్రమ ఒక వ్యాపార రంగం. అందులో నటులు పారితోషికం తీసుకోవడం సహజమే.
సామాజిక అంశాలపై సినిమా తీసి డబ్బు సంపాదించడం కూడా తప్పు కాదు.
కానీ ఒక సామాజిక సమస్యను సినిమాలో చూపించి ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుని లాభాలు పొందుతున్నప్పుడు, అదే సమస్య పరిష్కారానికి నిజ జీవితంలో కూడా కొంత బాధ్యత తీసుకోవాలనే ప్రశ్న రావడం సహజం.
లిసినిమాలో నా పాత్ర మాత్రమే. నిజ జీవితంలో అది నా బాధ్యత కాదులి అనే సమాధానం చట్టపరంగా సరిపోవచ్చు.
కానీ ప్రజా నైతికత పరంగా?
అది మనం ఆలోచించాల్సిన విషయం.

**మరో పెద్ద ప్రశ్న సెలబ్రిటీ ప్రకటనలు**

ఇది ఇంకా తీవ్రమైన విషయం.
ఒక సాధారణ వ్యక్తి ఒక ఉత్పత్తిని సిఫారసు చేస్తే అతని ప్రభావం పరిమితంగా ఉంటుంది.
కానీ ఒక స్టార్ హీరో ఒక ఉత్పత్తిని ప్రచారం చేస్తే, అతని అభిమానులు లిహీరో వాడుతున్నాడు కాబట్టి మనం కూడా వాడొచ్చులి అనే మానసిక ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంటుంది.
అందుకే సెలబ్రిటీ ప్రకటనలకు ప్రత్యేక బాధ్యత ఉంది.
భారతదేశంలో ఏఖూజ×(ఏూఎజవతీఅంఱఅస్త్ర క్ఖుఅఖుతీఎం జశీబఅఎఱశ్రీ శీట ×అఎఱు) మార్గదర్శకాలు కూడా ఇదే విషయాన్ని గుర్తిస్తున్నాయి. సెలబ్రిటీలకు ప్రజల్లో ఎక్కువ విశ్వసనీయత, ప్రభావం ఉండటంతో, వారు చేసే ప్రకటనల్లోని క్లెయిమ్‌లు తప్పుదారి పట్టించేవిగా ఉండకూడదని, తమకు తగిన ఎబవ ఎఅశ్రీఱ- స్త్రవఅఎవ చేయాలని ఏఖూజ× చెబుతోంది.
అంతేకాదు, వినియోగదారుల రక్షణ చట్టపరమైన వ్యవస్థలో తయారీదారులు, ప్రకటన సంస్థలు, ఎవశ్రీవఎతీఅ్వ వఱఎశీతీంఎతీం, జుబఎ- శ్రీఅంప్రవతీం కూడా తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో బాధ్యత వహించాల్సి రావచ్చు.
అంటే ఇది కేవలం మన భావోద్వేగ ప్రశ్న కాదు.
ఇది వినియోగదారుల హక్కులకు సంబంధించిన ప్రశ్న కూడా.

**నేను తాగను... కానీ ప్రకటన చేస్తాను అనే నైతిక ప్రశ్న**

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న
ఒక సెలబ్రిటీ వ్యక్తిగతంగా ఒక ఉత్పత్తిని ఉపయోగించకపోయినా, దానికి ప్రకటన చేయవచ్చా?

**చట్టపరమైన పరిస్థితి ఒక్క అంశం.కానీ నైతిక బాధ్యత మరో అంశం.**

ఉదాహరణకు, ఒక వ్యక్తి తన ఆరోగ్యానికి హానికరమని భావించి ఒక పానీయాన్ని తాగకపోతే, అదే ఉత్పత్తిని కోట్లాది ప్రజలకు **ఇదే బెస్ట్** అన్నట్టుగా ప్రచారం చేయడం ఎంతవరకు నైతికం?
అదే ప్రశ్న ఆహారం, ఆరోగ్య ఉత్పత్తులు, విద్యా సంస్థలు, ఫైనాన్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ అన్ని రంగాలకూ వర్తిస్తుంది.
ASCI ప్రకారం, సెలబ్రిటీ endorsement(Advertising Standards Council of India) ఒక వ్యక్తి యొక్క నిజమైన, ప్రస్తుత అభిప్రాయాన్ని ప్రతిబింబించాలి మరియు ఆ ఉత్పత్తి గురించి తగిన సమాచారం లేదా అనుభవం ఆధారంగా ఉండాలి. అందుకే డబ్బు తీసుకోవడం తప్పు అని కాదు.
కానీ డబ్బు కోసం ప్రజల నమ్మకాన్ని ఉపయోగించడం తప్పు కావచ్చు
ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలి
ఇక్కడ మొత్తం తప్పును హీరోల మీదే వేయడం కూడా సరైనది కాదు.
ఎందుకంటే చివరికి ఉత్పత్తిని కొనేది మనమే.
ప్రకటనను చూసి వెంటనే నమ్మేది మనమే.
హీరో చెప్పాడని ఆరోగ్యానికి సంబంధించిన నిర్ణయం తీసుకోవడం మన తప్పు కూడా.
హీరో నటుడు. వైద్యుడు కాదు.

**హీరో బ్రాండ్ అంబాసిడర్. పోషకాహార నిపుణుడు కాదు**

హీరో సినిమా పాత్రలో సామాజిక కార్యకర్త కావచ్చు. కానీ ప్రతి విషయంలో నిజ జీవిత నిపుణుడు కాదు.
అందుకే మనం అభిమానించాలి కానీ అంధంగా(Blind) అనుసరించకూడదు.
హీరోను అభిమానించండి... కానీ మీ ఆరోగ్యాన్ని అమ్ముకోవద్దు
ఒక హీరో సినిమా నచ్చితే చూడండి.
అతని నటన నచ్చితే అభినందించండి.
అతని ప్రతిభను గౌరవించండి.కానీ
మీ ఆరోగ్య నిర్ణయాన్ని హీరో చేతిలో పెట్టవద్దు.
మీ పిల్లల విద్యా నిర్ణయాన్ని ప్రకటన చేతిలో పెట్టవద్దు.
మీ ఆర్థిక భవిష్యత్తును సెలబ్రిటీ మాట మీద ఆధారపరచవద్దు.
మీ ఆహారపు అలవాట్లను సినిమా ప్రభావంతో మార్చుకోవద్దు.
ప్రకటనలో చెప్పిన ప్రతి క్లెయిమ్‌ను పరిశీలించాలి. ఆరోగ్యానికి సంబంధించిన క్లెయిమ్‌లకు శాస్త్రీయ ఆధారం ఉందా లేదా చూడాలి. ఏఖూజ× కూడా ఆరోగ్య, పోషకాహార క్లెయిమ్‌లకు తగిన శాస్త్రీయ ఆధారం ఉండాలని స్పష్టం చేస్తోంది.

**అసలు హీరో ఎవరు?**

సినిమాలో కోట్ల రూపాయలు సంపాదించే వ్యక్తి హీరో కావచ్చు.
కానీ నిజ జీవితంలో
పేద పిల్లల చదువు కోసం పోరాడే ఉపాధ్యాయుడు హీరో.
ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల కోసం నిలబడే వైద్యుడు హీరో.
ఉద్యోగాల కోసం పోరాడే యువకుడు హీరో.
తన హక్కుల కోసం రోడ్డెక్కే కార్మికుడు హీరో.
సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించే సామాన్య పౌరుడు హీరో.
ఎందుకంటే తెరపై పోరాటానికి చప్పట్లు వస్తాయి.
నిజ జీవిత పోరాటానికి మాత్రం ధర చెల్లించాలి.
ఆ ధర చెల్లించడానికి సిద్ధపడినవాడే నిజమైన సామాజిక హీరో.
చివరి ప్రశ్న మనందరికీ
మనము ఎవరిని హీరోలుగా చేసుకుంటున్నాం?
కేవలం తెరపై డైలాగులు చెప్పేవారినేనా?
లేక ప్రజల కోసం నిజ జీవితంలో నిలబడేవారినేనా?
కోట్ల రూపాయల ప్రకటనలు చేసే వ్యక్తిని చూసి ఉత్పత్తి కొనేముందు
ఈ ఉత్పత్తి నేను నిజంగా అవసరంతో కొనుగోలు చేస్తున్నానా?
లేక నాకు నచ్చిన హీరో చెప్పాడని కొనుగోలు చేస్తున్నానా?
అని ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుందాం.
అదే నిజమైన చైతన్యం.
ప్రజారా... హీరోలను ద్వేషించాల్సిన అవసరం లేదు.
కానీ హీరోల మాటలను ప్రశ్నించకుండా నమ్మాల్సిన అవసరం కూడా లేదు.
అభిమానం ఉండాలి...
అంధాభిమానం(దీశ్రీఱఅఱ అవంం) ఉండకూడదు.
ప్రజాదరణకు బాధ్యత జత కావాలి.
డబ్బుకు నైతికత జత కావాలి.
సినిమాకు సామాజిక స్పృహ జత కావాలి.
ప్రజలకు ప్రశ్నించే తత్వం ఉండాలి.
తెరపై హీరోలు చాలామంది ఉంటారు...
కానీ నిజ జీవితంలో ప్రజల కోసం నిలబడే హీరోలు ఎంతమంది?
ఈ ప్రశ్నకు సమాధానం మనమే వెతుక్కోవాలి.


జిలుకరా రామ్మూర్తి

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభ నేపథ్యంలో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టొద్దు..

## నాలుగు నెలలు ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్యే నాయిని



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48, 49 డివిజన్లలో రేణుక ఎల్లమ్మ దేవాలయం, శివాలయం అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అండర్ గ్రౌండ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం అన్ని డివిజన్లలో కొత్త రోడ్ల నిర్మాణ పనులను కొంతకాలం వేచి ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ పనులు ప్రారంభమైన తర్వాత కొత్తగా వేసిన రోడ్లను తిరిగి తవ్వాల్సిన పరిస్థితి వస్తుందని, దాంతో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో పాటు ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు.ఇప్పుడు రోడ్లు వేసి నాలుగు నెలల తర్వాత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం అదే రోడ్లను మళ్లీ తవ్వడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అవుతుంది. ప్రజలకు కూడా ఇబ్బందులు కలుగుతాయి. అందుకే ఖ+ణ పనులు పూర్తయ్యే వరకు కొత్త రోడ్ల పనులను హోల్డ్‌లో ఉంచాలని సూచిస్తున్నాం అని ఎమ్మెల్యే తెలిపారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా పైప్‌లైన్లు, విద్యుత్ సంబంధిత మౌలిక వసతులు తదితర పనులను సమన్వయంతో చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని పనులు పూర్తయిన తర్వాత రోడ్లను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయడం ద్వారా పదేపదే రోడ్లు తవ్వాల్సిన అవసరం లేకుండా చూడవచ్చన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సుమారు 6 వేల కోట్ల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.నగరంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాత నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పాత పైప్‌లైన్ల స్థానంలో అధునాతన సామర్థ్యం కలిగిన కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు, పాతబడిపోయిన ఫిల్టర్ బెడ్‌లు, నీటి శుద్ధి వ్యవస్థలను కూడా ఆధునీకరించనున్నట్లు చెప్పారు.వరంగల్ నగరంలో చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.ఖ+ణ పనులు ప్రారంభమై పూర్తయ్యే సమయంలో కొంతకాలం రోడ్ల తవ్వకాలు, నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఉండవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే తాత్కాలిక ఇబ్బందులను భరిస్తే భవిష్యత్‌లో నగరానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.అన్ని కాలనీల ప్రజలకు నా విజ్ఞప్తి. మరో నాలుగు నెలల పాటు రోడ్లు, డ్రైనేజీ పనుల విషయంలో కొంత సహకరించండి. ఇప్పుడే రోడ్లు వేయించుకుని, ఖ+ణ పనుల కోసం మళ్లీ వాటిని తవ్వడం కంటే ఒకేసారి అన్ని మౌలిక వసతుల పనులు పూర్తి చేసి శాశ్వతంగా మంచి రోడ్లు వేయడం మంచిది. ప్రజల డబ్బు వృథా కాకుండా చూడటం మన బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఖ+ణ పనుల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా 48, 49 డివిజన్ల ప్రజలతో ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై మాట్లాడి, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ అవమానించిన అమార ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారిని కల్పిత నాయకుడు అని" ఒక కల్పిత పుస్తకం" వ్రాస్తున్న ముళ్ళ పంది అయినటువంటి కల్పిత హమారా ప్రసాద్ దిష్టి బొమ్మను పుల్కల్ మండల కేంద్రంలో పుల్కల్ మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో దహనం చేయడంతో పాటు పుల్కల్ పోలీస్ స్టేషన్లో హమారా ప్రసాద్ మీద కంప్లైట్ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో పెద్దరెడ్డి పేట మాజీ సర్పంచ్ తలారి అంజయ్య , సింగూర్ మధుసూదన్ , బేగరి.కరుణాకర్, పుల్కల్ ఉప సర్పంచ్ ప్రవీణ్, మేతరి శ్రీనివాస్ , నిరంజన్ ,లక్ష్మన్,కృష్ణ, ఏసు, ఉదయ్, ప్రవీణ్, వినయ్, కిరణ్, పోచయ్య, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు....



# ఎస్ పి ఎం లో వెరిఫికేషన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

## సీపీఐ ఫ్లోర్ లీడర్‌కు జేసీ వినతి

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కరీంనగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్ (ఎస్ పి ఎం)లో కార్మిక సంఘాల వెరిఫికేషన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, గెలిచిన యూనియన్‌తోనే యాజమాన్యం వేతన ఒప్పందం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేసింది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్ పి ఎం కార్మికుల సమస్యలను లేవనెత్తి, వెరిఫికేషన్ ఎన్నికలను త్వరగా జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జేఏసీ నాయకులు కోరారు.గత 110 రోజులుగా ఎస్ పి ఎం కంపెనీ గేటు ముందు వెరిఫికేషన్ ఎన్నికల డిమాండ్‌తో సామూహిక నిరాహార దీక్షలు కొనసాగుతున్నా, యాజమాన్యం, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, వెరిఫికేషన్ ఎన్నికలు త్వరగా జరిగేలా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. కార్మికులు తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడుకోవాలని, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కలవే నీ శంకర్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాసు, జేఏసీ నాయకులు కుశన రాజన్న, షబ్బీర్ హుస్సేన్, ఏకే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# టూర్ ఆఫ్ అనంతగిరి సైక్లింగ్ ఈవెంట్

## - చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డా. ప్రియాంక వర్గీస్ ప్రత్యేక చొరవ



**ప్రజావాయిస్/వికారాబాద్:**
"టూర్ ఆఫ్ అనంతగిరి" సైక్లింగ్ కార్యక్రమం ఆదివారం నార్సింగి నుంచి ప్రారంభమై అనంతగిరిలో ముగిసింది. ఈ కార్యక్రమంలో సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు.చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డా. ప్రియాంక వర్గీస్ చొరవతో, మార్గదర్శకత్వంలో పర్యావరణ పర్యాటకం, అటవీ సంరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా అటవీ అధికారి విశాల్ బత్తుల సైక్లిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. అటవీ సంరక్షణ ప్రాధాన్యతతోపాటు వికారాబాద్ జిల్లాలోని ప్రకృతి సౌందర్యం, పర్యావరణ పర్యాటక అవకాశాలను వివరించారు.కార్యక్రమ వేదిక వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో అనంతగిరి ఎకో-అర్బన్ పార్క్, కోట్‌పల్లి బోటింగ్, జిల్లాలో చేపడుతున్న ఇతర పర్యావరణ పర్యాటక కార్యక్రమాలను తెలియజేసే ప్రచార ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, నిర్వాహకులు, సైక్లిస్టులు పాల్గొన్నారు.